

నందమూరి జయకృష్ణ గారి సతీమణి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు గారి సోదరి పద్మజ పరమదించారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాను. ఈ ఘటన తెలుగుదేశం పార్టీ శ్రేణులు,అభిమానుల్లో విషాదం నింపింది. పద్మజ గారి ఆత్మకు శాంతిని చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



బుధవారం 20.08.2025

INK OF TRUTH


# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 128 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# సాయంతో సంతృప్తి



ప్రభుత్వం

- తీసుకునే ప్రతి నిర్ణయమూ పేదల కోసమే
- టీడీపీతోనే ఆడబిడ్డలకు అండలం
- ప్రజారోగ్య పరిరక్షణకు సంజీవని పేరుతో పథకం తెస్తాం
- 250 కుటుంబాల బాగోగులకు సమయం కేటాయిస్తా
- అడాప్ట్ ట్రీని కుప్పంలోని బంగారు కుటుంబానికి అందించిన సీఎం
- జీవితాలు బాగు చేస్తున్నారంటూ బంగారు కుటుంబాల భావోద్వేగం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం ప్రతి నిర్ణయమూ పేదలను దృష్టిలో పెట్టుకునే తీసుకుంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమం అమలును మంగళవారం సీఎం చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించారు. మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది ఉగాది నాడు పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించగా..అప్పటి నుంచి బంగారు కుటుంబాలు, మార్గదర్శుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 13,40,697 బంగారు కుటుంబాలను 1,41,977 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..”పేదరిక నిర్మూలన ఎన్టీఆర్ సిద్ధాంతం. సమాజమే దేవాలయం..ప్రజలే దేవుళ్లు అని భావించే సిద్ధాంతాన్ని బలంగా నమ్మి పరిపాలన చేస్తున్నాం. అందుకే ప్రతినిత్యం పేదల కోసమే ఆలోచన చేస్తున్నాం. పేదల అభ్యున్నతికే నిర్ణయాలు తీసుకుంటున్నాం. ఆర్థిక సంస్కరణలతో సంపద వచ్చింది. ఇప్పుడు సమాజంలో అసమానతలు తగ్గించాల్సిన అవసరం ఉంది. అందుకే పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించాం. రాష్ట్ర వ్యాప్తంగా 1.69 కోట్ల కుటుంబాలు ఉన్నాయి.. సాయం కోరే పేద కుటుంబాలు 21 లక్షలు ఉన్నాయి. మార్గదర్శుల ఎంపికలో ఎలాంటి బలవంతం లేకుండా.. పూర్తి స్వచ్ఛంధంగానే ఈ కార్యక్రమాన్ని చేపడతున్నాం. సేవ చేయడానికి ఒక్కొక్కరు ఒక్కో మార్గాన్ని ఎంచుకుంటారు. ఇటీవలే ఓ అజ్ఞాత భక్తుడు తాను స్థాపించిన కంపెనీ ద్వారా వచ్చిన సంపాదన నుంచి రూ. 140 కోట్ల విలువైన 121 కేజీల బంగారాన్ని తిరుమల వెంకన్నకు ఇచ్చారు. ఇంత భారీ ఎత్తున విరాళం ఇచ్చినా.. తన పేరు బయటకు తీసుకురావద్దని కోరారు. ఇలా కొంత మంది తమకు తోచిన రీతిలో సేవ కార్యక్రమాలు చేస్తూ ఉంటారు. ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా.. రాని తృప్తి, సంతృప్తి పేదలకు సేవ చేసినా.. సాయం చేసినా కలుగుతుంది.

**చెప్పడమే కాదు... చేసి చూపిస్తున్నాను... :** “నేను కూడా మార్గదర్శినే. కుప్పం నియోజకవర్గానికి చెందిన 250 కుటుంబాలను దత్తత తీసుకున్నాను. సీఎంగా, పార్టీ అధ్యక్షుడిగా ఎంత బిజీగా ఉన్నా... దత్తత తీసుకున్న కుటుంబాలకు సమయం కేటాయిస్తా. మార్గదర్శులు ఇచ్చే చేయూతను బంగారు కుటుంబాలు అందిపుచ్చుకోవాలి.. అభివృద్ధి చెందాలి.. సద్వినియోగం చేసుకోవాలి. అలాగే సమాజం ఇచ్చిన సహకారంతో ఎదిగిన వారు సమాజానికి తిరిగివ్వాలని మార్గదర్శులు కూడా ఆలోచించాలి. మార్గదర్శులు డబ్బులిచ్చి సాయం చేయడంతో సరిపెట్టకుండా...


2 లో



## రెవెన్యూ సిబ్బందికి సెలవులు రద్దు

- కృష్ణానది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

మిగతా 2లో...



## అమరావతిపై అంత అక్కసా?



**గుంతల్లోకి నీరు వస్తే ఐకానిక్ భవనాలు మునిగిపోయినట్లేనా?**

**పశ్చిమ బైపాస్ పై బ్రిడ్జి నిర్మించిన దగ్గర మట్టి అడ్డుగా ఉండటంతో కొండవీటి వాగు వరద నీరు నిలిచిపోయింది**

**కారణాలు తెలియకుండా వైసీపీ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు సహించరు**

**మంత్రి నారాయణ**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని అమరావతి మునిగిపోయిందంటూ పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తోన్న వైసీపీ నాయకులపై మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు...అమరావతిపై ఏడుపులు ఇకనైనా ఆపాలని వైసీపీ నాయకులకు హితవు పలికారు...అమరావతిలో కొండవీటి వాగు నీటి ప్రవాహానికి ఆటంకం కలగడంతో వరద నీరు నిలిచిపోయిన ప్రాంతాలను మంత్రి నారాయణ పరిశీలించారు...అమరావతి డెవలప్ మెంట్ కార్పొరేషన్ సీఎండీ లక్ష్మీ పార్థసారథి తో కలిసి ఆయా ప్రాంతాల్లో మంత్రి పర్యటించారు... విజయవాడ పశ్చిమ బైపాస్ పై ఈ – 11 రోడ్డు వద్ద కొండవీటి వాగుపై నేషనల్ హైవేస్ అధికారులు ఓ వంతెన నిర్మించారు...ఈ వంతెన నిర్మాణ సమయంలో అక్కడ మట్టిని అలాగే వదిలేయడంతో అక్కడే కొండవీటి వాగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది...దీంతో వంతెన దిగువ నుంచి నీరు వెళ్లే మార్గం లేక నీరుకొండ పరిసర ప్రాంతాల్లో పొలాల్లో వరద నీరు నిలిచిపోయింది....వాస్తవపరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన మంత్రి నారాయణ అక్కడికక్కడే అధికారులకు

మిగతా 2లో...

## విశాఖ ఉక్కు ప్లాంట్‌పై దుష్ప్రచారం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** విశాఖ ఉక్కు ప్లాంట్ ప్రైవేటీకరణపై వ్యాప్తి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని వెంటనే ఆపాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “విశాఖ ఉక్కు ప్లాంట్ ప్రైవేటైజ్ అవుతుందంటూ వైసీపీకి అనుబంధంగా ఉన్న కొంతమంది నాయకులు, కార్మిక సంఘ నేతలు చేస్తున్న ప్రచారం పూర్తిగా నిరాధారం. ఆంధ్రుల గౌరవ ప్రతీకగా నిలిచిన ఉక్కు ప్లాంట్ ఎప్పటికీ ప్రైవేటీకరణ కాదు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ప్లాంట్ పరిరక్షణలో కీలకపాత్ర పోషించారు” అని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 11,440 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 2,600 కోట్లు సమకూర్చి మొత్తం రూ. 14 వేల కోట్లకు పైగా నిధులు తెచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ నిధులతో ముడిసరుకు, విద్యుత్, నీటి అవసరాలు తీర్చబడ్డాయని వివరించారు. 1998లో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధాని ఉన్నప్పుడు కూడా టిడిపి నేతల సహకారంతో రూ. 1,350 కోట్లు తెచ్చి ప్లాంట్‌ను కాపాడిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

ప్రస్తుతం చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీ భరత్ కృషి, నరేంద్ర మోడీ ప్రభుత్వ సహకారంతో విశాఖ ఉక్కు ప్లాంట్ మళ్లీ లాభదాయక దిశగా సాగుతోందని తెలిపారు. ప్రస్తుతం ప్లాంట్‌లో మూడు బ్లాస్ట్ ఫర్నేసులు ఉండగా, అందులో రెండు పూర్తి స్థాయిలో నడవడంతో లాభాల్లోకి ప్రవేశిస్తోందని చెప్పారు. నెలకు రూ. 240 కోట్ల జీతభారం ఉన్నప్పటికీ, పూర్తి ఉత్పత్తితో రూ. 100–200 కోట్ల లాభం సాధ్యమవుతుందని వివరించారు.

2020–25 మధ్య వైసీపీ పాలనలో ప్లాంట్ కేవలం 20–30 శాతం

మిగతా 2లో...



## స్పిన్నింగ్ మిల్స్ సమస్యలపై చర్చ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని స్పిన్నింగ్ మిల్స్ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ టెక్స్ టైల్ మిల్స్ ఫెడరేషన్ ప్రతినిధులు, పరిశ్రమలు, విద్యుత్, చేనేత మరియు జౌళి శాఖ అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ చర్చించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని చేనేత మరియు జౌళి పరిశ్రమల పునరుద్ధరణ, అభివృద్ధికి చేయూతను అందివ్వాలనే అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. వారి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని చేనేత మరియు జౌళి యూనిట్ల పునరుద్ధరణకు చేపటాల్సిన చర్యలు, అమలు చేయాల్సిన

మిగతా 2లో...

## స్త్రీశక్తి పథకం భారం కాదు, బాధ్యతే



- మంత్రి మండిపల్లి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న స్త్రీశక్తి పథకంను ప్రజలు హర్షిస్తుండగా, వైసీపీ మాత్రం విమర్శలు చేయడమే పనిగా పెట్టుకుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్త్రీశక్తి పథకం వల్ల లక్షలాది అక్కాచెల్లెమ్మలు నేరుగా లబ్ధి పొందుతున్నారని, ఇది ప్రభుత్వానికి భారం కాదని, బాధ్యతేనని మంత్రి స్పష్టం చేశారు. ఈ పథకం ఘాట్ రోడ్లలోనూ అమలవుతోందని, ప్రయాణానికి అవసరమైన ఆధార్, పాన్, ఓటర్ కార్డుల జిరాక్స్, సాఫ్ట్ కాపీలు కూడా సరిపోతాయని తెలిపారు. ప్రజలు సంతోషిస్తున్న పథకాలపై వైసీపీ కడుపుమంటతో విమర్శలు చేయడం తప్ప మరేమీ చేయలేకపోతోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై విమర్శలు కాకుండా, సలహాలు, సూచనలు ఇవ్వడం వైసీపీ నేతలకు మేలని ఆయన సూచించారు.

## జగన్.. జైలు యాత్రలు

- అవినీతి, కల్తీ మద్యం కుంభకోణాలే జగన్ రాజకీయ గుర్తింపు
- మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** అవినీతి, అక్రమ మద్యం వ్యాపారం, హత్యలు, కిడ్నాప్ కేసుల్లో అరెస్టైన వైసీపీ నేతలను జగన్ మోహన్ రెడ్డి పరామర్శించడం సిగ్గుచేటని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు విమర్శించారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్‌పై విరుచుకుపడ్డారు. జగన్ రాజకీయాల్లో కొత్త రకమైన యాత్రలు మొదలు పెట్టారని, దండయాత్రలు, జైత్రయాత్రలు చూసిన ప్రజలు ఇప్పుడు ‘జైలు యాత్రలు’ కూడా చూస్తున్నారని ఎద్దేవా చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ పతాకానికి

మిగతా 2లో...

## అసత్య ప్రచారాలపై చర్యలు

- సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసేవారిపై చర్యలకు అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టం
- వాస్తవాలను తెలియజేసేందుకు ప్రత్యేకంగా ఒక ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ ఏర్పాటు చేస్తాం
- అవాస్తవాలను వాస్తవాలుగా చిత్రీకరిస్తూ ప్రజలను అభత్రావాభానికి గురి చేస్తున్నారు
- ఎపి బ్రాండ్ ను దెబ్బతీసే రీతిలో సోషల్ మీడియాలో లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు
- సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేస్తే తట్టుకోలేక లేనిపోని ఆరోపణలు
- శ్రీకాంత్ పెరోల్ రద్దు చేసి తిరిగి జైలులో పెట్టాం దానిపై విచారణ జరుగుతోంది
- రాష్ట్ర హెూంశాఖామంత్రి అనిత





**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించి అభద్రతా భావానికి గురిచేసే వారిపై ఇకపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుందని దీనిపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టాన్ని కూడా తీసుకురానున్నట్టు రాష్ట్ర హెూం మరియు విపత్తుల నిర్వహణ శాఖామంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం

మిగతా 2లో...

## వరదలపై అప్రమత్తం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాలకు కృష్ణా, గోదావరి, తుంగభద్ర నదులు ఉధృతంగా ప్రవహిస్తున్న

మిగతా 2లో...

## బార్ లైసెన్స్ దరఖాస్తు రుసుము.. రూ. 5 లక్షలకు తగ్గింపు

**బార్ ల లైసెన్స్ రుసుములో భారీ తగ్గింపు**

**కొత్త బార్ విధానం ప్రకారం బార్‌ల కేటాయింపులో పారదర్శకత పెద్దపీట**

మిగతా 2లో...

## ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ప్రభాకర్‌ను కలిసిన టిడిపి నేత నలుకుర్తి రమేష్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ నూతన చైర్మన్‌గా నియమితులైన ఆకెపోగు ప్రభాకర్‌ను తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ రాష్ట్ర సచివాలయంలోని ప్రభాకర్ కార్యాలయంలో జరిగింది.

ఈ సందర్భంగా రమేష్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆధ్వర్యంలో కార్పొరేషన్ ఎస్సీ వర్గాల అభ్యున్నతికి మరింతగా కృషి చేస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా వెనుకబడిన వర్గాలకు మేలు చేకూరేలా చర్యలు తీసుకోవాలని రమేష్ సూచించినట్లు సమాచారం.

## రెవెన్యూ సిబ్బందికి సెలవులు రద్దు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రకాశం బ్యారేజ్ వద్ద వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విజ్ఞప్తి చేశారు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాలకు ఆనుకుని ఉన్న లంక గ్రామాల ప్రజలను అధికారులు నిరంతరం అప్రమత్తం చేయాలని మంత్రి ఆదేశించారు. కృష్ణానది కరకట్ట వెంబడి పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంటుందని, అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. కరకట్టల్లో గండి పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించిన ఆయన, అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రెవెన్యూ అధికారులందరికీ ప్రభుత్వం సెలవులు రద్దు చేసింది అని స్పష్టం చేశారు. తుఫాను తీరం దాటుతున్న నేపథ్యంలో మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లకూడదని హెచ్చరించారు. కృష్ణానది పొంగిపొర్లుతున్న తరుణంలో ప్రజలు నదిని, కాలువలను దాటే ప్రయత్నం చేయరాదని సూచించారు. ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని, సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మరాదని మంత్రి సత్యప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు.

## విశాఖ ఉక్కు ప్లాంట్‌పై దుష్ప్రచారం



(మొదటి పేజీ తరువాయి)

సామర్థ్యంతోనే నడవడం వల్ల నష్టాల్లో కూరుకుపోయిందని, అప్పట్లో కాంట్రాక్టు ఉద్యోగాల పేరుతో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఈ అంశాలపై కఠిన విచారణ తప్పదని పల్లా హెచ్చరించారు.

నిర్వాసిత కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించే దిశగా ఇప్పటికే చర్యలు కొనసాగుతున్నాయని, 8,000 మందికి న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. "ప్లాంట్ ఎప్పటికీ పబ్లిక్ సెక్టార్‌లోనే కొనసాగుతుంది. కార్మికుల సంక్షేమం, నిర్వాసితుల హక్కులు, ప్లాంట్ అభివృద్ధి అన్నీ కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత" అని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వ్యాప్తి చెందడం రాష్ట్రానికి ప్రమాదకరమని హెచ్చరిస్తూ, "అజ్ఞానం కన్నా తప్పుడు జ్ఞానం ప్రమాదకరం. కాబట్టి ఎవరైనా సమాచారాన్ని పంచే ముందు వాస్తవాలు తెలుసుకోవాలి" అని పల్లా శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

## బార్ లైసెన్స్ దరఖాస్తు రుసుము.. రూ. 5 లక్షలకు తగ్గింపు

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన బార్ పాలసీ దరఖాస్తుదారులకు వరంలా మారిందని, లైసెన్స్ ఫీజులో భారీ తగ్గింపుతో పాటు లైసెన్స్ ఫీజును బార్ యజమానులు ఆరు సులభ వాయిదాల్లో చెల్లించే సదుపాయం కల్పించడంతో వారికి ఆర్థికంగా లాభదాయకంగా మారనుందని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ తెలిపారు. గతంలో బార్ లైసెన్స్ దారులు ఫీజు మొత్తాన్ని ఒకేసారి చెల్లించాల్సిరావడం వారికి ఆర్థికంగా భారమైందన్నది వాస్తవమన్నారు.

బార్ లైసెన్స్ ఫీజులో భారీ తగ్గింపు దరఖాస్తుదారులకు గొప్ప వరమని, అంతేకాకుండా ఎక్కువ మంది దరఖాస్తుదారులను ఆకర్షించే అవకాశం కల్పిస్తుందన్నారు. ఉదాహరణకు కడపలో బార్ లైసెన్స్ ఫీజు గతంలో రూ. 1.97 కోట్లు ఉండగా, ఇప్పుడు రూ. 55 లక్షలకు తగ్గించారు. అదేవిధంగా అనంతపురంలో లైసెన్స్ ఫీజు రూ. 1.79 కోట్ల నుండి రూ. 55 లక్షలకు, తిరుపతిలో రూ. 1.72 కోట్ల నుండి రూ. 55 లక్షలకు, ఒంగోలులో అంతకుమునుపు రూ. 1.4 కోట్ల నుండి రూ. 55 లక్షలకు తగ్గించడం జరిగిందన్నారు. అలాగే లైసెన్స్ దారులు ఫీజును ఆరు వాయిదాల్లో చెల్లించే సదుపాయం కల్పించారు. అదేవిధంగా పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరులో బార్ లైసెన్స్ ఫీజు గతంలో రూ. 71 లక్షల ఉండగా రూ. 35 లక్షలకు తగ్గించారని వివరించారు. కొత్త బార్ విధానంలో దరఖాస్తు రుసుము రూ. 5 లక్షలకు తగ్గించగా, అంతకుమునుపు విధానంలో తొంభై శాతం పట్టణ స్థానిక సంస్థల్లోని బార్లు రూ. 5 లక్షలకు మించి దరఖాస్తు రుసుము చెల్లించాల్సి వచ్చేదన్నారు. అంతకుమునుపు విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, నెల్లూరు, గుంటూరులో 362 బార్లకు ప్రతి దరఖాస్తుకు రూ. 10 లక్షల దరఖాస్తు రుసుము ఉండేదని, మదనపల్లె, చీరాల, బాపట్ల, ఒంగోలు వంటి చిన్న మునిసిపాలిటీలలో దాదాపు 399 బార్లకు దరఖాస్తు రుసుము రూ. 7.5 లక్షలు ఉండేదని, ఇప్పుడు రాష్ట్రం అంతటా ఏకరూపంగా రూ. 5 లక్షల దరఖాస్తు రుసుము నిర్ధారించడం జరిగిందన్నారు. ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించడానికి బార్ లైసెన్సులను బహిరంగ లాటరీ ద్వారా కేటాయిస్తామని చెప్పారు. బార్ కార్యకలాపాలను లాభదాయకంగా మార్చేందుకు లైసెన్స్ ఫీజుని నిర్ణయించామని అన్నారు. యాభై వేల జనాభా వరకు ఉన్న పట్టణాలకు రూ. 35 లక్షలు, యాభై వేలకు మించి ఐదు లక్షల వరకు జనాభా ఉన్న చోట్ల రూ. 55 లక్షలు మరియు ఐదు లక్షలకు మించిన జనాభా ఉన్న నగరాలకు రూ. 75 లక్షల ఫీజు నిర్ధారించామని, ఇది రిటైల్ ఎ4 షాపులతో పోలిస్తే 26% నుండి 48% వరకు తక్కువ అని తెలిపారు.

# సాయంతో సంతృప్తి

(మొదటి పేజీ తరువాయి)

బంగారు కుటుంబాలకు భరోసాగా ఉండాలి. భూమి మీద ఎవరూ శాశ్వతం కాదు. వెళ్లేటప్పుడు ఏం తీసుకెళ్లలేరు. మానవత్వం ఉన్న మనుషులుగా బతకాలి. చనిపోయిన తర్వాత కూడా మనల్ని గుర్తు పెట్టుకునే పనులు చేయాలి. డొక్కా సీతమ్మ అంటే పేదల పెన్నిధి. అన్నదాతగా ఇప్పటికీ ప్రజల్లో గుర్తుండిపోయారు. మంచి కార్యక్రమం చేస్తే చరిత్ర గుర్తు పెట్టుకుంటుంది. అందుకే సమాజం కోసం పని చేయాలని కోరుతున్నాను. పీ4 అమలు విషయంలో ఇకపై ప్రతి రోజూ మానిటరింగ్ ఉంటుంది... మూడు నెలలకోసారి సమీక్ష ఉంటుంది." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ఆదాయం ఉండాలి... పేదలకు సేవ చేయాలనే తపన ఉండాలి :** "పేదలకు సేవ చేయాలన్నా... సంక్షేమం అందించాలన్నా... సంపద సృష్టించాలి. ఆదాయాన్ని తీసుకురావాలి. పేదలకు మేలు చేయాలనే మనస్సు ఉండాలి. అప్పుడే సంక్షేమం అందివ్వగలం. ఏ రాష్ట్రం అమలు చేయని విధంగా పెద్ద ఎత్తన సంక్షేమం అమలు చేస్తున్నాం. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమం అందిస్తున్నాం. సంపదను సృష్టికి కృషి చేస్తున్నాం. సంపద సృష్టించి.. ఆ సంపదను పేదలకు ఇచ్చే ప్రభుత్వం మాది. ఈ నెలలో అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. ప్రతి నెలా ఇచ్చే పెన్షన్లు ఇచ్చాం, అన్నదాత సుఖీభవ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేశాం. తల్లికి వందనం



పథకాన్ని ఈ నెలలోనే అమలు చేశాం. ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనం అమలు చేశాం. ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి తెచ్చాం. ఆడబిడ్డలకు ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చేలా చేశాం. ఆడబిడ్డలతో సహా ప్రతి ఒక్కరూ ఏదోక పని చేయాలి... ఉద్యోగం, ఉపాధి పొందాలి. ఉపాధి నిమిత్తం వెళ్లే ఆడబిడ్డలకు స్త్రీ శక్తి పథకం ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ధరలు పెరిగాయని మళ్లీ కొందరు కట్టెల పొయ్యి వాడారు. అందుకే మహిళల కోసం ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నాం. ఇలాంటి ఎన్నో పథకాలు పేదలకు అందించాలంటే దూరదృష్టి కావాలి. అందుకే స్వర్ణాంధ్ర 2047 విజన్ రూపొందించాం. విజన్ 2020 రూపొందిస్తే ఆనాడు అందరూ విమర్శించారు. కానీ ఆనాడు నేను చెప్పిన దానికంటే.. తెలంగాణ, హైదరాబాద్ ఎక్కువగా అభివృద్ధి చెందాయి. ఇప్పుడు విజన్ 2047 రూపొందించాం. 2047 పెద్ద దూరం లేదు 22 ఏళ్లు మాత్రమే ఉంది. ఈ ప్రణాళికలు నిజం కావాలంటే... ప్రభుత్వాల్లో కంటిన్యూటి ఉండాలి. ప్రస్తుతం హెచ్‌సీఎల్ వంటి సంస్థ గన్నవరంలో 5 వేల మందికి ఉపాధి కల్పిస్తోంది. 2019లో ప్రభుత్వం కొనసాగిఉంటే... మరింత మందికి ఉద్యోగాలు ఇచ్చేది.. ఉపాధి చూపించేది. అందుకే అభివృద్ధి వైకుంఠపాళి కాకూడదు." అని చంద్రబాబు చెప్పారు.

**ప్రజారోగ్య పరిరక్షణకు సంజీవని :** "ఆరోగ్యం కోసం బెస్ట్ విధానం తీసుకురాబోతున్నాం. బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ప్రజారోగ్య పరిరక్షణ చేపడతాం. సంజీవని పేరుతో



ప్రజారోగ్య పరిరరక్షణ కార్యక్రమాన్ని చేపట్టనున్నాం. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సంజీవని తెస్తున్నాం. ఇప్పటికే కుప్పంలో బిల్‌గేట్స్ ఫౌండేషనుతో డీజీ నెర్వ్ సెంటర్ ఏర్పాటు చేశాం. త్వరలో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తాం. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి తెస్తాం. పేద ప్రజల కోసం.. వారి ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది." అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో విదేశాల్లో ఉన్న వారితో జూమ్ ద్వారా చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. పేద కుటుంబాలను దత్తత తీసుకునేందుకు పలువురు సౌదీ ఆరేబియాకు చెందిన తెలుగువారు ముందుకు వచ్చాయి. వారితో నిర్వహించిన ముఖాముఖి సందర్భంగా పలువురు బంగారు కుటుంబాలకు చెందిన ప్రతినిధులు భావోద్వేగానికి గురయ్యారు. పీ4 ద్వారా హెచ్‌సీఎల్ కంపెనీలో ఉద్యోగం కల్పించటంతో కృష్ణా జిల్లావాసి పావని భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. అలాగే కుప్పంలో తాను దత్తత తీసుకున్నదానికి సంకేతంగా అడాప్ట్ ట్రీని బంగారు కుటుంబాలకు ముఖ్యమంత్రి అందించారు. ఈ కార్యక్రమంలో పీ4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ కుటుంబరావు, ఎన్నార్టీ ఛైర్మన్ వేమూరి రవి కుమార్, ప్రణాళిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అమరావతిపై అంత అక్కసా?

(మొదటి పేజీ తరువాయి)

పలు ఆదేశాలు జారీ చేసారు... ప్రొక్లెయిన్ లు ఏర్పాటు చేసి మట్టి తొలగించడంతో పాటు జాతీయ రహదారి పై కూడా స్వల్పంగా గండి కొట్టి నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు... ఆ తర్వాత అక్కడికొచ్చిన మీడియాతో మంత్రి నారాయణ మాట్లడుతూ వైసీపీపై తీవ్రంగా మండిపడ్డారు.

అమరావతిపై ఇకనైనా మీ ఏడుపులు ఆపాలంటూ వైసీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేసారు. లేదంటే ఈసారి ఆ 11 సీట్లు కూడా ప్రజలు మీకివ్వరన్నారు... ఎక్కడైనా నిర్మాణాలు జరిగేటప్పుడు వర్షం వస్తే గుంతల్లోకి నీళ్లు రావా...? గుంతల్లోకి నీరు వస్తే ఐకానిక్ భవనాలు మునిగిపోయినట్లేనా? అని వైసీపీ నాయకులను ప్రశ్నించారు.. అమరావతిపై దుష్ప్రచారం చేస్తే ప్రజలు సహించరని అన్నారు... పశ్చిమ బైపాస్ పై బ్రిడ్జి నిర్మించిన దగ్గర మట్టి అడ్డుగా ఉండటంతో నీరు నిలిచిపోయిందన్న మంత్రి... అది కూడా కేవలం రెండు గ్రామాల పరిధిలో మాత్రమే పొలాల్లో



నీరు నిలిచిందన్నారు. మిగతా గ్రామాల్లో వర్షం పడిన కొన్ని గంటల్లోనే నీరు బయటికి వెళ్లిపోయిందన్నారు... ప్రస్తుతం కొండవీటి వాగు ప్రవాహానికి అడ్డుగా ఉన్న మట్టిని వేగంగా తొలగించే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు మంత్రి.. ఎవరెన్ని అనుకున్నా అమరావతి పనులు జరిగిపోతూనే ఉంటాయన్నారు.. వచ్చే మార్చి నాటికి అధికారులు, ఉద్యోగుల క్వార్టర్లు కూడా సిద్ధం చేస్తున్నామన్నారు... రాజధాని మునిగిపోయిందని ప్రచారం చేస్తున్న వారు అమరావతికి వచ్చి పరిస్థితి చూడాలని మంత్రి సూచించారు.

# స్పిన్నింగ్ మిల్స్ సమస్యలపై చర్చ

(మొదటి పేజీ తరువాయి)

పథకాలు, అందించాల్సిన ప్రోత్సాహాలు తదితర అంశాలపై ఈ సమావేశంలో ఆయన సమగ్రంగా చర్చించారు. రాష్ట్రంలో ఉన్న టెక్స్ టైల్స్ యూనిట్లలో సిక్ అయిపోయిన వాటి పునరుద్దరణకు ప్రభుత్వ పరంగా ఏ మేరకు సహాయాన్ని అందజేసే అవకాశం ఉంటుందో అంచనాలతో ప్రతిపాదలను రూపొందించాలని పరిశ్రమలు, విద్యుత్, చేనేత మరియు జౌళి శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ప్రభుత్వ స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలపై నివేదికలు అందజేస్తే, వాటిని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్ యువరాజ్ పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా రాష్ట్రంలోని టెక్స్‌టైల్స్ యూనిట్లు సితిగతులు, కొన్ని యూనిట్లు సిక్ అవ్వడానికి దారితీసిన కారణాలను, వాటి పునరుద్దరణకు ప్రభుత్వం పరంగా చేపట్టాల్సిన



చర్యలను వివరించారు.

ఆంధ్రప్రదేశ్ టెక్స్ టైల్ మిల్స్ ఫెడరేషన్ ప్రతినిధులు కోటేశ్వర రావు, సుధాకర్, ఫణి తదితరులు మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న రాయితీ బకాయిలను వెంటనే చెల్లించాలని, పవర్ టారిఫ్ రిబేటుగా యూనిట్ కు ప్రభుత్వం ఇస్తున్న రూ. 2/- ల రిబేటు నెలవారి విద్యుత్ బిల్లులోనే తగ్గించేలా చూడాలని, టెక్స్ టైల్ పరిశ్రమలే స్వంతగా క్యాప్టివ్ పవర్ యూనిట్లను స్థాపించుకునేందుకు అనువుగా అనుమతులు, రాయితీలను అందజేయాలని మరియు ప్రస్తుతం ఉన్న ఇ.డి. చార్జీల విషయంలో పాత విదానాన్నే అనుసరించాలని వారు కోరారు.

రాష్ట్ర చేనేత మరియు జౌళి శాఖ స్పెషల్ సి.ఎస్. సిసోడియా, ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డు రాస్, అన్ని డిస్కమ్ ల సి.ఎం.డి.లు వర్చ్యువల్ గాను, రాష్ట్ర చేనేత మరియు జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి, పరిశ్రమల శాఖ అదనపు సంచాలకులు రామలింగేశ్వర రాజు మరియు ఆంధ్రప్రదేశ్ టెక్స్ టైల్ మిల్స్ ఫెడరేషన్ ప్రతినిధులు కోటేశ్వర రావు, సుధాకర్, ఫణి తదితరులు ప్రత్యక్షంగా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# అసత్య ప్రచారాలపై చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక సోషల్ మీడియాలో విషం చిమ్ముతూ వాస్తవాలను అవాస్తవాలుగా చిత్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించడమే గాక అభద్రతా భావానికి గురి చేస్తున్నారని ఇకపై అలాంటి దుష్ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టనుందని స్పష్టం చేశారు. అంతేగాక ప్రత్యేకంగా ఒక ప్యాక్ట్ ఫైండింగ్ కమిటీని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసి వాస్తవాలేమిటో ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని అన్నారు. అమరావతి మునిగిపోయిందని విజయవాడ ప్రకాశం బ్యారేజి గేట్లు పనిచేయడం లేదని పలు అసత్యప్రచారాలను సోషల్ మీడియాలో ఇష్టారీతిన ప్రసారం చేస్తూ ప్రభుత్వంపై మూకుమ్మడి దాడి చేస్తున్నారని ఇకపై అలాంటి తప్పుడు వార్తల ప్రసారాలను సమర్ధవంతంగా తిప్పకొట్టడం తోపాటు అందుకు కారకులపై చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్టు మంత్రి అనిత స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ విజయవంగా అమలు చేయడంతో ప్రతిపక్షపార్టీ తట్టులేక పోతోందని అందుకే సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారాన్ని చేస్తోందని హోం మంత్రి అనిత విమర్శించారు. ఇది ఆపార్టీకి వారసత్వంగా వచ్చిన సమస్యగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. ఒక్క ఆగష్టు నెలలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నేతన్నలకు, నాయి బ్రాహ్మణులకు 200 వరకూ ఉచిత విద్యుత్, స్త్రీశక్తి పథకం కింద మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిచండం జరిగిందని అన్నారు. నాలుగు రోజుల్లో సుమారు 20 లక్షల మందికి పైగా మహిళలు ఉచిత బస్సుల్లో ప్రయాణించి సుమారు 20 కోట్ల రూ.ల వరకూ లబ్ది పొందారని తెలిపారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంటే ఏపి బ్రాండ్ ఇమేజ్ ను దెబ్బతీసే విధంగా ప్రతిపక్ష వైసిపి వారి అనుబంధ మీడియా సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి అనిత పేర్కొన్నారు. ఏపి బ్రాండ్ ఇమేజ్ గురించి మాట్లాడాలంటే ముందుగా గుర్తువచ్చేది సియం చంద్రబాబు నాయుడేనని అలాంటి ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేయడమేమిటన్నారు. అమరావతిపై లేనిపోని రాతలు రాసేవారిపై కేసులు పెడతామని ఆనాడు రఘురామ కృష్ణ రాజుపై కాదు ఈనాడు మీరు పెడుతున్న తప్పుడు పోస్టులపై రాజద్రోహం కేసులు పెట్టాలని అన్నారు. ఇకపై ఇలాంటి తప్పుడు పోస్టులు పెట్టవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సియం స్పష్టం చేశారని మంత్రి అనిత పునరుద్ఘాటించారు. అసాంఘిక శక్తులను ఎలా అరికట్టాలో చంద్రబాబుకు బాగా తెలుసని అలాంటి శక్తులపై ఉక్కుపాదం మోపుతామని శాంతిభద్రతల విషయంలో రాజీలేదు హెూం మంత్రి అనిత స్పష్టం చేశారు.

పెరోల్ రావడం వెనుక ఏముంది ఎవరున్నారనే దానిపై పూర్తిగా విచారణ జరుపుతున్నామని ఈసంఘటనలో ఎవరున్నా వారిపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెూంమంత్రి అనిత స్పష్టం చేశారు. శ్రీకాంత్ విషయంలో ఎస్కార్ట్ సిబ్బందిపై కూడా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. క్రిమినల్ రికార్డు ఉన్న వ్యక్తికి పెరోల్ వచ్చిందని జైలు అధికారి చెప్పారని వెంటనే అతని పెరోల్ రద్దు చేసి తిరిగి జైలుకు పంపామని అన్నారు. ఈఘటనలో పోలీస్ అధికారులు ఎవరున్నా వారిపై కూడా విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అరుణ అనే మహిళ దిశా ఫౌండేషన్ కు సెల్ఫ్ డిక్లేర్డ్ సెక్రటరీ అని ఆమె నుంచి హెూంశాఖ పేషీకి ఫోన్ వచ్చిందని దానిపై కూడా దర్యాప్తు చేస్తున్నామని ఆమె గురించి ఆమె వెనుకున్న వారి గురించి ఆరా తీస్తున్నాని తెలిపారు.

## జగన్.. జైలు యాత్రలు

(మొదటి పేజీ తరువాయి)



సమయం కేటాయించని జగన్, తమ పార్టీ నేతలు జైల్లో ఉంటే ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లలో వెళ్తారని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో రాజమండ్రి జైలు వైసీపీ ప్రధాన కార్యాలయమయ్యే పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. కల్తీ మద్యం వల్ల ఇప్పటివరకు 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారని, లక్షలాది మంది దీర్ఘకాలిక వ్యాధులతో బతుకుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దశలవారీగా మద్యపాన నిషేధం చేస్తానని హామీ ఇచ్చిన జగన్, అడ్డగోలుగా ఆదాయం పెంచుకుని ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టారని ఆరోపించారు. మిధున్ రెడ్డి మద్యం కుంభకోణంలో, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎం ధ్వంసం కేసులో, నందిగం సురేష్ మహిళ హత్య కేసులో, వల్లభనేని వంశీ కిడ్నాప్ కేసులో, కాకాని గోవర్ధన్ అక్రమ మైనింగ్ కేసులో నిందితులని గుర్తు చేశారు. వీరిని పరామర్శించడమే కాకుండా, మద్యం పాలసీ నుంచి ముడుపుల వసూళ్ల వరకు మిధున్ రెడ్డి కీలక పాత్ర పోషించారని, ఆయన ఖాతాల్లో నెలకు 5-6 కోట్ల రూపాయలు జమ అయ్యాయని నక్కా ఆనందబాబు ఆరోపించారు. జగన్ పులివెందుల ఎమ్మెల్యేగా గెలిచినా తన ప్రాంతానికి రాకపోవడం, ప్రజల సమస్యలపై పోరాడేందుకు అసెంబ్లీకి హాజరు కాకపోవడం పిరికిపందల లక్షణమని దుయ్యబట్టారు. గతంలో జగన్ తండ్రి లక్షల కోట్ల అవినీతికి పాల్పడి జైలులో ఉన్నారని, ఆ కేసుల ద్వారానే ప్రజలకు 'క్విడ్ ప్రో కో', 'షెల్ కంపెనీలు' అనే పదాలు తెలిసాయని గుర్తు చేశారు. జగన్ రాబోయే రోజుల్లో తామే జైలు యాత్రలు చేయడం కాదు, నాయకులు ఆయనకు పరామర్శ యాత్రలు పెట్టే పరిస్థితి వస్తుందని వ్యాఖ్యానించారు. జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి మృతి చెందిన 26 కుటుంబాలను జగన్ పరామర్శించాలని నక్కా ఆనందబాబు డిమాండ్ చేశారు.

## వరదలపై అప్రమత్తం



(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో విపత్తుల నిర్వహణ శాఖ స్పెషల్ సీఎస్ జి.జయలక్ష్మి కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. విపత్తుల నిర్వహణ సంస్థలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు వరదలపై కలెక్టర్లకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇచ్చారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. వరద ప్రవాహాన్ని బట్టి లోతట్టు ప్రాంతప్రజలను ఎప్పటికప్పుడూ అప్రమత్తం చేయాలన్నారు. అవసరమైతే ముంపు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. నిత్యవసర వస్తువులు, మెడిసిన్, శానిటేషన్ మెటీరియల్ వంటివి అందుబాటులో ఉంచాలన్నారు.

వరద ముంపు ప్రాంతాల నుండి బాధితులను సహాయ శిబిరాలకు తరలించడం, సురక్షితమైన తాగునీరు, ఆహారం, పాలు అందించడం, ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం ఇతర సహాయ కార్యకలాపాలు కోసం ప్రభావిత జిల్లాలకు టిఆర్-27 క్రింద ఒక్కో జిల్లాకు కోటి రూపాయలు చొప్పున 16 జిల్లాలకు 16 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అత్యవసర సహాయక చర్యలు కోసం కృష్ణా జిల్లా - అవనిగడ్డ, ఎన్టీఆర్ జిల్లా - విజయవాడ, కృష్ణా ఘాట్, అల్లూరి జిల్లా చింతూరు, కోనసీమ- అమలాపురంలో ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

గోదావరి నదికి వరద ప్రవాహం మంగళవారం సాయంత్రం 6 గంటలకు భద్రాచలం వద్ద నీటిమట్టం 36.6 అడుగులు అందని పేర్కొన్నారు. ధవళేశ్వరం వద్ద ఇన్, ఔట్ ఫ్లో 7.40 లక్షల క్యూసెక్కులు ఉందన్నారు. ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద సాయంత్రం 6 గంటల నాటికి ఇన్, ఔట్ ఫ్లో 4.66 లక్షల క్యూసెక్కులు ఉందని రేపటికి మరింత వరద పెరిగే అవకాశం ఉందన్నారు. రేపు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

వివిధ ప్రాజెక్టులలోని నీటిని దిగువకు విడుదల చేస్తున్నందున ఆయా నదీపరీవాహక లోతట్టు/లంక గ్రామప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బోట్లు, మోటర్ బోట్లు, స్టీమర్లలతో నదిలో ప్రయాణించడం, వరద నీటిలో ఈతకు వెళ్ళడం, చేపలు పట్టడం, స్నానాలకు వెళ్ళడం లాంటివి చేయరాదని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ పొంగిపొర్లే వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదన్నారు. పూర్తిస్థాయిలో వరద తగ్గే వంకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## జాతీయ క్రీడా దినోత్సవం-2025 ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆగస్టు 29 నుండి 31 వరకు దేశవ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవం–2025ను ఉత్సాహభరితంగా నిర్వహించేందుకు క్రీడా శాఖ విస్తృత ప్రణాళికలు రూపొందించింది. ఈ సందర్భంగా కేంద్ర క్రీడాశాఖ మంత్రి మనసుఖ్ మాండవీయ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించబడింది. ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సచివాలయంలోని ఛాంబర్ నుండి పాల్గొన్నారు.

ప్రజల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేలా, ఆరోగ్యం – ఫిట్‌నెస్ పై అవగాహన కల్పించేలా ప్రతి రాష్ట్రం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కేంద్ర మంత్రి సూచనలు చేసారు. ఆగస్టు 29న ఉద్యోగుల మధ్య వినోదాత్మక పోటీ ఆటలు, ఆగస్టు 30న మాజీ ఛాంపియన్లతో సదస్సులు, సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు . అలాగే ఆగస్టు 31న "Sundays on Cycle" పేరుతో సైక్లింగ్ ర్యాలీలు జరిపి సమాజంలో ఆరోగ్యకరమైన జీవనశైలి పై సందేశం ఇవ్వాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ – రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, ముఖ్యంగా విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, యువజన సంఘాలు, క్రీడా సంస్థలు చురుకుగా పాల్గొనేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రతి పౌరుడూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, క్రీడలను జీవితంలో భాగంగా చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## వివేకా కుమార్తె, అల్లుడిపై పెట్టిన కేసులను క్వాష్ చేసిన సుప్రీం కోర్టు



**దిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :**వివేకా హత్య కేసుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ఎన్.కె. సింగ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. వివేకా కుమార్తె సునీతతోపాటు, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, అప్పటి సీబీఐ విచారణాధికారి రాంసింగ్‌పై పెట్టిన కేసులను క్వాష్ చేస్తామని ధర్మాసనం పేర్కొంది.

వివేకా కుమార్తె సునీత తరఫున న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. అవినాష్ సహా ప్రధాన నిందితుల బెయిల్ రద్దు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు గడువు వల్లే దర్యాప్తు ముగించినట్లు సీబీఐ చెబుతోందని లూథ్రా వివరించారు. వివేకా హత్య కేసులో మరింత లోతుగా దర్యాప్తు అవసరం ఉందని పేర్కొన్నారు. అసలు సూత్రధారులు, పాత్రధారులు ఎవరో బయటకు రావాల్సి ఉందన్నారు. సాక్షులను బెదిరించడం, సాక్ష్యాలను నాశనం చేయాలని ప్రయత్నిస్తున్నారని లూథ్రా కోర్టుకు వెల్లడించారు. సునీత దంపతులతోపాటు రాంసింగ్‌పైనా కుట్రపూరితంగా కేసులు నమోదు చేశారని వివరించారు. దీంతో ఆ కేసులను సుప్రీంకోర్టు క్వాష్ చేసింది.

సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. "నిందితులను కాలపరిమితి లేకుండా జైలులో ఉంచడం మంచిది కాదు. కానీ.. హత్య తీరు చూస్తే నిందితులకు 2, 5 ఏళ్లు చాలా తక్కువే అనిపిస్తోంది. ఆధారాలు చెరిపేయడం, సాక్ష్యాధారాలు లేకుండా చేయడం నిరూపితమైంది. ముందు గుండెపోటు అని.. తర్వాత రక్తపు వాంతులని ప్రచారం చేశారు. హత్య అని తెలియకుండా అన్ని విధాలా ప్రయత్నం చేశారు. అన్ని వివరాలు దర్యాప్తులో పూర్తిగా బయటపడ్డాయి" అని ఎస్వీ రాజు కోర్టుకు వివరించారు.

ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది హుజేఫా అహ్మదీ వాదనలు వినిపిస్తూ.."నిందితుడు శివశంకర్ రెడ్డి కొడుకు చైతన్య రెడ్డి మెడికల్ క్యాంప్ పేరుతో కడప జైలుకు వెళ్లారు. ఇందుకు సంబంధించి అన్ని ఆధారాలు ఫొటోలతో సహా ఉన్నాయి. జైలుకెళ్లి అప్రూవర్ దస్తగిరిని బెదిరించినట్లు సాక్ష్యాలున్నాయి" అని పేర్కొన్నారు. ఇక ఈ కేసులో కోర్టు మరణశిక్ష విధించే అవకాశం కూడా ఉందని సీబీఐ తరపు న్యాయవాది పేర్కొన్నారు.

## రిషి సునాక్‌కు హత్య బెదిరింపులు.. యువకుడికి జైలుశిక్ష



**దిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ పై జాత్యాహంకార బెదిరింపులకు పాల్పడిన ఓ 21 ఏళ్ల యువకుడికి స్థానిక కోర్టు జైలుశిక్ష విధించింది. ఈ రోజుల్లో ఇలాంటి వివక్షతకు ఎక్కడా చోటు లేదని స్పష్టం చేసింది. క్రౌన్ ప్రాసిక్యూషన్ సర్వీస్ తెలిపిన వివరాల ప్రకారం.. బర్కన్‌హెడ్‌కు చెందిన లియామ్ షా గతేడాది జూన్‌లో రిషి సునాక్‌కు జాత్యాహంకార హత్యా బెదిరింపులతో కూడిన రెండు ఈమెయిళ్లు పంపాడు. ఆ సమయంలో సునాక్ బ్రిటన్ ప్రధానిగా ఉన్నారు. ఆయన వ్యక్తిగత సహాయకుడు వాటిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ క్రమంలోనే సెప్టెంబరులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. విచారణ క్రమంలో.. మెయిళ్లు పంపినట్లు తనకు గుర్తే లేదని, ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్నట్లు అతడు పేర్కొన్నాడు. అయితే, గత నెల కోర్టు ముందు హాజరైన సందర్భంలో తన నేరాన్ని అంగీకరించాడు. ఈ క్రమంలోనే గత బుధవారం కోర్టు అతడికి 14 వారాల జైలుశిక్ష విధించింది. 20 రోజులు పునరావాస కేంద్రంలో గడపాలని, మాదకద్రవ్యాల రిహాబిలిటేషన్ కోర్సును కూడా పూర్తి చేయాలని ఆదేశించింది. అదేవిధంగా రెండేళ్లపాటు రిషి సునాక్‌కు, ఆయన కార్యాలయానికి దూరంగా ఉండాలని పేర్కొంది.

"ప్రజాప్రతినిధితో నేరుగా సంప్రదించే సౌకర్యమనేది ప్రజాస్వామ్యానికి మూలస్తంభం లాంటిది. దాన్ని దుర్వినియోగం చేయడం.. ప్రజాస్వామ్య ప్రక్రియకు హాని కలిగిస్తుంది" అని కోర్టు తన తీర్పు సమయంలో వ్యాఖ్యానించింది. అయితే, జైలుశిక్ష అమలును ఏడాది కాలానికి నిలిపేసింది.

# 'ఇది యాపారం': అమెరికా గురి ఒకరిపై.. గుచ్చుకొనేది ఇంకొకరికి..!

**దిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** "అమెరికా ద్వంద్వ వైఖరి బయటపడింది. మేము పోటీపడుతున్న ప్రతి రంగంలో వారు అడ్డుపుల్లలు వేస్తున్నారు" అని భారత వాణిజ్య మంత్రి పేర్కొన్నారు. ఈ ఆరోపణ ఇప్పటిది కాదు. దాదాపు 35 ఏళ్ల క్రితం నాటి రాజీవ్ గాంధీ ప్రభుత్వంలోని వాణిజ్య మంత్రి దినేష్ సింగ్ చేసిన ప్రకటన. 1989లో భారత్‌పై అమెరికా ప్రభుత్వం 'సూపర్ 301' చర్యలపై స్పందన..!

ఇప్పటి చైనా వలే 1980ల చివర్లో అమెరికా ఆర్థిక వ్యవస్థతో జపాన్ తీవ్ర స్థాయిలో పోటీపడింది. దానిని లక్ష్యంగా చేసుకొని అమెరికా చేపట్టిన చర్యలకు చివర్లో భారత్ బాధిత దేశంగా మారింది. ఇక 2025లో చైనాను టార్గెట్ చేసుకొని ట్రంప్ సర్కారు వాణిజ్య యుద్ధం మొదలుపెట్టింది. వాషింగ్టన్ నుంచి తయారీ రంగాన్ని బీజింగ్ లాగేసుకోవడంతోనే ఈ చర్యలు అని పేర్కొనడం అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు అగ్రరాజ్యం అసలు విషయాన్ని పక్కనపెట్టి భారత్‌పై చర్యలకు నడుం బిగించడం విడ్డూరంగా ఉంది. భారీగా వాణిజ్య మిగులు సాధించిన చైనాకు మినహాయింపులు ఇస్తూ.. భారత్‌తో వాణిజ్య చర్చలను నిలిపివేసింది. నవంబర్ 10 వరకు బీజింగ్‌కు పన్నుల నుంచి ఊరట కల్పించింది. చైనాపై ఆంక్షలు విధిస్తే అంతర్జాతీయ చమురు రేట్లు పెరుగుతాయంటూ అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొనడం మరీ విడ్డూరంగా ఉంది. అమెరికా చర్యలపై ఆ దేశ మాజీ ఎన్ఎస్ఏ జాన్ బోల్టన్ స్పందిస్తూ "చైనా విషయంలో ఉదారంగా ఉండటం.. భారత్‌పై కఠిన వైఖరిని ట్రంప్ అవలంభిస్తున్నారు. రష్యా, చైనా నుంచి భారత్‌ను దూరం చేయడానికి ఏళ్ల తరబడి అమెరికన్లు పడిన శ్రమ వృథాగా మారింది" అని వ్యాఖ్యానించారు.



**భారత్ సంబంధాలను నాడు దెబ్బతీసిన సూపర్ 301? :** 1980ల్లో జపాన్ రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. దీనికి వాణిజ్యంలో అమెరికా ప్రధాన ప్రత్యర్థి. టెక్నాలజీ విషయంలో రెండు దేశాలు సహకరించుకొంటున్నా.. వాణిజ్యం విషయంలో మాత్రం విపరీతమైన పోటీ ఉండేది. అమెరికాతో వాణిజ్యంలో జపాన్‌కు బిలియన్ల కొద్దీ మిగులు ఉండేది. అప్పట్లో అమెరికా పత్రికలు దీనిని తరచూ ఎద్దేవా చేసేవి.

**అమెరికాలో 6,000 మందికి విద్యార్థి వీసాలు రద్దు..! :** 1981లో రోనాల్డ్ రీగన్ అధ్యక్షుడిగా శ్వేతసౌధంలోకి అడుగుపెట్టాక.. వాణిజ్య లోటు తగ్గించుకోవడానికి జపాన్ ఆర్థిక వ్యవస్థను తెరవాలని అమెరికా ఒత్తిడి తీసుకురావడం మొదలుపెట్టింది. కానీ, 1988లో జార్జ్ హెచ్‌డబ్ల్యూ బుష్ హయాంలో కఠిన చర్యలు చేపట్టింది. ఆ దేశం ఓమ్ని బస్ ట్రేడ్ అండ్ కాంపిటేటీవ్‌నెస్ యాక్ట్, 1974 అమెరికా ట్రేడ్ యాక్ట్ సెక్షన్ 301 సవరణలను తీసుకొచ్చింది. అసమంజస వాణిజ్య విధానాలు చేస్తున్న దేశాలను గుర్తించి వాణిజ్య ఆంక్షలు విధించింది. సెక్షన్ 301ను 'సూపర్ 301'గా పిలవడం మొదలుపెట్టారు. మొదట్లో జపాన్ దీని లక్ష్యంగా మారింది. అప్పట్లో పారిశ్రామిక వేత్త అయిన డొనాల్డ్ ట్రంప్ కూడా జపాన్ అమెరికన్ల రక్తం పీల్చేస్తోందని విమర్శించినట్లు 2019లో సీఎన్ఎన్ పేర్కొంది.

**ఆ తర్వాత భారత్‌పై గురిపెట్టి.. :** 1989 మే నెలలో సూపర్ 301 దేశాల జాబితాను అమెరికా విడుదల చేసింది. దీనిలోని 8 దేశాల్లో జపాన్, బ్రెజిల్, భారత్ ఉన్నాయి. అప్పట్లో అమెరికాతో వాణిజ్యం కారణంగా భారత్‌కు కేవలం 690 మిలియన్ డాలర్లు మాత్రమే మిగిలేవి. ఇక జపాన్‌కు బిలియన్ల డాలర్ల లబ్ధి ఉండేది. ఆ తర్వాత రాజీవ్ ప్రభుత్వం అధికారం కోల్పోయి వీపీ సింగ్ ప్రధానిగా పగ్గాలు చేపట్టారు. ఆయన కూడా రాజీవ్ వలే అమెరికా ఒత్తిడికి తలొగ్గలేదు. భారత్‌కు అత్యాధునిక టెక్నాలజీ రాకుండా, ఎగుమతులను నిలిపివేయడంతో వాణిజ్య యుద్ధానికి తెరతీసింది. భారత్ బీమా రంగంలోకి అమెరికా కంపెనీలకు అనుమతి, సినీరంగం, హోం వీడియోస్ మార్కెట్లో అవకాశాలు, అగ్రరాజ్య కంపెనీలు ఇక్కడ సంస్థల్లో 50శాతం కంటే వాటాలను కొనుగోలు చేయడానికి అవకాశం వంటివి కీలక డిమాండ్లుగా ఉన్నాయి. భారత్ మాత్రం చాలా సహనంగా ఓపిక పట్టింది.

**పరిస్థితి ఎలా మారిందంటే.. :** అమెరికాలోని ఓ చట్టం కారణంగా భారత్‌పై ఆంక్షల్లో జాప్యం జరిగింది. అప్పట్లో ఏ దేశంపైన అయినా చర్యలు చేపట్టాలంటే యూఎస్‌టీఆర్ దర్యాప్తు చేపట్టి.. సదరు దేశం వల్ల అమెరికా కంపెనీలు ఎంత నష్టపోతున్నాయో గుర్తించాలి. దీని వల్ల కొంత జాప్యం చోటు చేసుకొంది. 1990 ఏప్రిల్‌లో చర్చల కారణంగా సూపర్ 301 జాబితా నుంచి జపాన్, బ్రెజిల్‌ను తప్పించారు. భారత్ మాత్రం కొంతకాలం కొనసాగింది. అయితే భారత్‌పై చర్యలు మాత్రం తీసుకోలేదు. ఆ తర్వాత పీవీ నరసింహారావు ప్రభుత్వం భారతలో ఆర్థిక సంస్కరణలను తీసుకొచ్చింది. దీంతో మన మార్కెట్లు తెరుచుకోవడంతో భారత్ తప్పించుకొంది.

అమెరికా హఠాత్తుగా సంబంధం లేని దేశాలపై చర్యలకు తెగబడుతుందనడానికి సూపర్ 301 ఓ బలమైన ఉదాహరణగా నిలిచింది. నాడు జపాన్ కోసం నేడు చైనా కోసం మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధంలో చివరికి భారత్ లక్ష్యంగా మారింది.

## గణేష్ ఉత్సవాల నుంచే స్వాతంత్ర్య ఉద్యమం ప్రారంభం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** భారత స్వాతంత్ర్య ఉద్యమానికి పునాది గణేష్ ఉత్సవాల నుంచే వేసిందని జిల్లా గణేష్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షులు రామచంద్ర రాజు పేర్కొన్నారు. భారతీయ విద్యాభవన్‌లో జిల్లా గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

రామచంద్ర రాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకే ప్రాధాన్యం ఇస్తూ గణేష్ ఉత్సవాలను సమితి నిర్వహిస్తోందని తెలిపారు. నగరంలో గణేష్ మండపాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా జిల్లా సమితిలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంప్రదాయ వస్త్రధారణతో దైవత్వం ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా గణేష్ ఉత్సవ సమితి లోగోను ఆవిష్కరించి, కరపత్రాలను విడుదల చేశారు.

రాష్ట్ర కార్యదర్శి ఆర్. లక్ష్మీపతి మాట్లాడుతూ గణపతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో, శబ్ద కాలుష్యం లేకుండా సాంప్రదాయబద్ధంగా నిర్వహించాలని సూచించారు. మండపాల ఏర్పాటు విషయంలో ప్రభుత్వం కూడా సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు మదన్ పురోహిత్, జిల్లా ఉపాధ్యక్షులు హరిహర రాయల్, ప్రధాన కార్యదర్శి మున్నలూరి నాగేశ్వరరావు, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు కంచర్ల ఆంజనేయులు, బఫెన్ మావ్య, నంబూరి సుబ్బారావు, తాడికొండ సాయికుమార్, మల్లా శివకృష్ణ, రవి శ్రీనివాస్, కాకాని పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులు...సినీ నిర్మాతలు... పట్టు విడుపు తో వ్యవహరించాలి

**తెనాలి 19,(జర్నలిస్ట్ ఫైల్)** కార్మికుల సమ్మెతో సినీ పరిశ్రమకు భారీ నష్టం ఏర్పడ నుందని

పట్టు విడుపు అంశం ఇరువురిలొ ఉండాలని 15శాతం పెంపుదలను అంగీకరించాలని,మా ఏపివ్యవస్థాపకులు ,సినీదర్శకుడు దిలీప్ రాజా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.



స్థానిక 'మా–ఏపీ' కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దిలీప్ రాజ మాట్లాడుతూ గత 15రోజులుగా జరుగుతున్న సినీ కార్మికుల సమ్మె విషయంలొ,నిర్మాతలకు, కార్మికులకు మధ్య పట్టు విడుపులు ఉంటెనే పరిష్కారం దొరుకుతుందన్నారు.దసరా, సంక్రాంతికి విడుదల కావాల్సిన పెద్ద సినిమాలు సమ్మె కారణంగా సమయానికి విడుదల కాలేని పరిస్థితని ఆయనతెలిపారు .

ఒకేసారి 30శాతం వేతనాలను, పెంచితె చిన్న బడ్జెట్ సినిమాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.వందలకోట్ల బడ్జెట్ తో అగ్రహీరోలతో సినిమాలు రూపొందించే నిర్మాతల నుండి ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన పద్ధతిలో కొంత మేరకు కార్మికుల వేతనాలు పెంచడండాన్ని పరిశీలించవలసిందిగా ఆయన పెద్ద నిర్మాతలను కోరారు. 3 నుండి 5 కోట్ల బడ్జెట్ తో నిర్మించే చిన్న సినిమాలకు వేతనాల పెంపు విషయంలో కొంతమేర సడలింపు అవసరమన్నారు.

నిర్మాత క్షేమంగా ఉంటేనే సినిమాలు బయట కొస్తాయని ఆయన తెలిపారు.అలాగే కష్టపడి పనిచేసే కార్మికుల జీవన పరిస్థితులపై పెద్ద సినిమాల నిర్మాతలు కార్మికులను, కుటుంబ సభ్యులుగా పరిగణించి వేతనాల పెంపు అంశంపై దృష్టి పెట్టాల్సిందిగా దిలీప్ రాజా మనవి చేశారు.కాగా

ప్రస్తుతం లైట్ బాయిస్ కు 1450/- నుండి 15 శాతం పెంచడానికి నిర్మాతలు పరిశీలిస్తున్నారని ఆయన తెలిపారు. 30శాతం పెంచాలనే కార్మికుల డిమాండ్ ను ఉపసంహరించుకుని నిర్మాతల శ్రేయస్సు గురించి ఆలోచించాల్సిందిగా కార్మికులను కోరారు.టీ కప్పులో తుఫాను వంటి, ప్రస్తుత వివాదాలను వీడి అందరం కలిసి కుటుంబ సభ్యులుగా పని చేసుకుందామ ని దిలీప్ రాజా సూచించారు.మంగళవారం హైదరాబాద్ లో జరుగుతున్న జనరల్ బాడీ సమావేశంలో ఇరు పక్షాలు సంయమనం పాటించి సమ్మె విరమణకు సహకరించాలన్న భావనను ఆయన వ్యక్థం చేశారు. సమావేశంలో మా–ఏపీ సభ్యులు సునీత,మిలటరీ ప్రసాద్, ఎర్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో 6,000 మందికి విద్యార్థి వీసాలు రద్దు..!

**అమెరికా :** అమెరికాలో నిబంధనలు ఉల్లంఘించిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకొంటున్నారు. తాజాగా 6,000 మంది అంతర్జాతీయ విద్యార్థుల వీసాల ను రద్దు చేసినట్లు బీబీసీ రిపోర్టులో పేర్కొంది. అమెరికా విదేశాంగశాఖ ఈవిషయాన్ని వెల్లడించినట్లు తెలిపింది. 4,000 మంది దేశ చట్టాలు ఉల్లంఘించడం, దాడులు, మత్తులో డ్రైవింగ్, దోపిడీలకు పాల్పడటం వంటివి చేసినట్లు తెలుస్తోంది. అమెరికా చట్టాల్లోని ఐఎన్ఏ 3బీ కింద ఉగ్రవాదానికి పాల్పడిన దాదాపు 300 మంది కూడా ఈ జాబితాలో ఉన్నారు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభంలో ఈ వీసాల రద్దు వ్యవహారం వెలుగులోకి రావడం గమనార్హం.




ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించాక దేశంలో ఉన్నత విద్యావ్యవస్థను పునర్ వ్యవస్థీకరించే పనిలో పడ్డారు. ప్రధాన విశ్వవిద్యాలయాలను లక్ష్యంగా చేసుకొని తీవ్రస్థాయిలో పాలసీల మార్పులు చేపట్టారు. ఇవి అంతర్జాతీయ విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. తొలుత జనవరిలో యాంటీసెమిటిజమ్‌ను(యూదులపై వ్యతిరేకత) అరికట్టేలా బిల్లును పాస్ చేశారు. అంతర్జాతీయ విద్యార్థులు పాలస్తీనాకు మద్దతుగా ఆందోళనలు చేపడితే ఈ ఆదేశాల ప్రకారం వారిని దేశ బహిష్కరణ చేయవచ్చు.

విదేశీ విద్యార్థులకు కొత్త ఇంటర్వ్యూల షెడ్యూల్‌ను నిలిపివేస్తూ జూన్‌లో ట్రంప్ కార్యవర్గం నిర్ణయం తీసుకొంది. అనంతరం సోషల్ మీడియా వెట్టింగ్‌ను కఠినతరం చేశారు. ఫారెన్ స్టూడెంట్స్ కచ్చితంగా వారి సామాజిక మాధ్యమ ఖాతాలు బహిర్గతం చేయాలని ఆదేశించారు. విద్యార్థుల పోస్టులు, కామెంట్లు, లైక్‌లను అమెరికా అధికారులు పరిశీలించి.. వారు జాతీయ భద్రతకు ముప్పు కాదు అని భావిస్తే మాత్రమే వీసా ప్రక్రియలో ముందుకువెళతారు.

ఇక కీలక విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు కేటాయించిన నిధుల్లో కోత విధించారు. క్యాంపస్‌ల్లో పాలస్తీనా అనుకూల ఆందోళనల్లో పాల్గొన్న చాలామంది విదేశీ విద్యార్థులను అరెస్టు చేయించారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్యార్థులను నియమించుకోకుండా బ్లాక్ చేశారు. ఈక్రమంలో ట్రంప్ కార్యవర్గం, విశ్వవిద్యాలయం మధ్య న్యాయపోరాటం మొదలైంది.

గతేడాది గణాంకాల ప్రకారం దాదాపు 10 లక్షల మందికి పైగా అంతర్జాతీయ విద్యార్థులు అమెరికాలో చదువుతున్నారు. వారి నుంచి దాదాపు 43.8 బిలియన్ డాలర్లు అమెరికాకు లభించాయని ఎన్ఏఎఫ్ఎస్ఏ అసోసియేషన్ వెల్లడించింది. దేశంలోని మొత్తం విద్యార్థుల్లో వీరు 6 శాతం వరకు ఉంటారు.

## సింగరేణికి బంగారు అవకాశం వచ్చింది




**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** సింగరేణి సంస్థ కీలక ఖనిజరంగంలోకి ప్రవేశించింది. బంగారం, రాగి గనుల అన్వేషణకు లైసెన్స్ దక్కించుకుంది. కర్ణాటకలోని దేవదుర్గ్‌లో బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్ కోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో 37.75శాతం రాయల్టీని కోట్ చేయడం ద్వారా సింగరేణి ఎల్–1 బిడ్డర్‌గా నిలిచిందని సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ తెలిపారు. సింగరేణిని ఇతర రంగాల్లోకి విస్తరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా చేస్తున్న ప్రయత్నంలో తొలి విజయం సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో ఈ గనుల్లో అన్వేషణ పూర్తి చేస్తామని సీఎండీ బలరామ్ స్పష్టం చేశారు.

కర్ణాటక దేవదుర్గ్ లోని బంగారం, రాగి నిక్షేపాలు ఉన్న ప్రాంతంలో సింగరేణి అన్వేషణ విభాగం ఆధ్వర్యంలో త్వరలో పరిశోధన చేయనుంది. వివిధ రకాల అన్వేషణల అనంతరం తుది ఫలితాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో సమర్పించాల్సి ఉంటుంది. అనంతరం కేంద్రం ఈ గనులను మైనింగ్ కోసం వేలం వేస్తుంది. ఆ గనులను సింగరేణి లేదా ఇతర సంస్థలు దక్కించుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ గనులను మైనింగ్ కోసం దక్కించుకున్న సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీలో 37.75 శాతాన్ని ఆ గని జీవిత కాలం పాటు సింగరేణికి చెల్లించాల్సి ఉంటుంది. ఈ అన్వేషణ కోసం దాదాపు రూ. 90 కోట్లు వ్యయం అవుతుండగా.. అందులో రూ. 20 కోట్లు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీగా చెల్లిస్తుంది.

## ఉద్ధృతంగా ప్రవహిస్తున్న గోదావరి..



**రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్) :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరిలోనూ వరద తాకిడి పెరిగింది. రాజమహేంద్రవరం వద్ద నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ధవళేశ్వరం వద్ద 10.5 అడుగుల నీటి మట్టం నమోదైంది. డెల్టా కాల్వలకు 2,100 క్యూసెక్కులు, సముద్రంలోకి 8.23 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి ఉద్ధృతి పెరిగింది. అక్కడ నీటిమట్టం 37.3 అడుగులకు చేరింది. మరోవైపు శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 1.45 లక్షల క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో 2 లక్షల క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులకు గానూ.. ప్రస్తుతం 1089 అడుగుల నీటిమట్టం ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గానూ.. ప్రస్తుతం 73.37 టీఎంసీల నీరు ఉంది. ప్రధాన గేట్ల ద్వారా 1.73 లోల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. కోనసీమలో వశిష్ఠ, వైనతేయ, గౌతమి, వృద్ధ గౌతమి నదీపాయలు పోటెత్తి ప్రవహిస్తున్నాయి. బూరుగులంక, అరిగెలవారిపేట, ఉడుముడిలంక, జి. పెదపూడిలంక, పెదమల్లంక, ఆనగారిలంక, అయోధ్యలంక, మర్రిమూల ప్రజలు మర పడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి భారీగా ప్రవహిస్తోంది. స్పిల్‌వే ఎగువన 31.68 మీటర్లు, దిగువన 23.07 మీటర్ల నీటిమట్టం ఉంది. 48 రేడియల్ గేట్ల ద్వారా 7,92,679 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

## భారత్, చైనా సంబంధాల్లో స్థిరమైన పురోగతి: ప్రధాని మోదీ


**దిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** భారత్, చైనా మధ్య సంబంధాలు స్థిరమైన పురోగతిని సాధించాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. గత ఏడాది రష్యాలోని కజాన్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో తన భేటీ అనంతరం పరిస్థితుల్లో సానుకూల మార్పు వచ్చిందన్నారు. భారత పర్యటనలో ఉన్న చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యీ నేడు ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. అనంతరం ప్రధాని ఈ మేరకు ట్వీట్ చేశారు.

"వాంగ్ యీని కలవడం ఆనందంగా ఉంది. గతేడాది కజాన్‌లో జిన్‌పింగ్‌తో సమావేశమైనప్పటినుంచి.. ఇరుదేశాల సంబంధాలు స్థిరమైన పురోగతిని సాధించాయి. పరస్పర ప్రయోజనాలు, సున్నిత అంశాలను గౌరవించడం ద్వారా ఇది సాధ్యమైంది. చైనాలోని తియాంజిన్‌లో నిర్వహించనున్న 'షాంఘై సహకార సంస్థ' శిఖరాగ్ర సదస్సు సమయంలో జిన్‌పింగ్‌తో సమావేశం కోసం ఎదురు చూస్తున్నాను. భారత్, చైనా ల మధ్య స్థిరమైన, నిర్మాణాత్మక సంబంధాలు.. ప్రాంతీయ, ప్రపంచ శాంతికి, అభివృద్ధికి దోహదపడతాయి" అని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

రెండు రోజుల భారత పర్యటనలో భాగంగా భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డొభాల్ తదితరులతో వాంగ్ యీ సమావేశమైన విషయం తెలిసిందే. పరస్పర గౌరవం, సున్నితత్వం, ప్రయోజనాల ఆధారంగా ఇరుదేశాల సంబంధాలు ముందుకు సాగాలని జైశంకర్ ఆకాంక్షించారు.

## అర్జీలు పునరావృతం కాకుండా చూడాలి

- నిర్దేశ సమయంలో నాణ్యతతో పరిష్కరించాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఆగస్టు 19(జర్నలిస్ట్‌ఫైల్):** ప్రజల నుండి స్వీకరించే అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని, నిర్దేశ సమయంలో నాణ్యతతో పరిష్కరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ.. అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 25, ఎంఏయూడీ 13, విద్య 10 పోలీస్ శాఖకు 9, హెల్త్ 7, ఇరిగేషన్ 4, విభిన్న ప్రతిభా వంతులు 3, డీఆర్‌డీఏ 3, ఇంటర్మీడియట్ విద్య 3, పంచాయతీరాజ్ 3, విద్యుత్ 2, పౌరసరఫరాలు 2, బ్యాంకు సేవలు 2 అర్జీలు వచ్చాయి. ఇదేవిధంగా వ్యవసాయం, కళాశాల విద్య, ఎండోమెంట్, హౌసింగ్, మార్కెటింగ్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, రహదారులు భవనాలు (ఆర్ అండ్ బీ) శాఖలకు సంబంధించి ఒక్కో అర్జీతో కలిపి మొత్తం 93 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో మంచి ఫలితాలు సాధించడంతో పాటు ప్రజా సమస్యలకు సంబంధించిన అర్జీలపై ప్రత్యేకంగా దృష్టిసారించి గడువులోగా పరిష్కరించేందుకు బృంద స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవలపై ప్రజల్లో విశ్వాసం పెంపొం దించేలా నిబద్ధతతో అర్జీల పరిష్కారానికి కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచిం చారు. అర్జీల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ రూపంలోనూ నిర్లక్ష్యం, కనిపిం చకూడదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్.లక్కియ, డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎ.పోసిబాబు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## రైతాంగ సంక్షేమం కోసం కృషి చేయాలి

### టిడిపి గన్నవరం నియోజకవర్గ నాయకులు కాసర్నేని రాజా



**గన్నవరం, ఆగష్టు 19(జర్నలిస్ట్‌ఫైల్):** కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, సహకార సంఘాల పాలకవర్గాలు రైతాంగ సంక్షేమం,సంఘాల బలోపేతానికి కృషి చేయాలని టిడిపి గన్నవరం నియోజకవర్గ నాయకులు కాసర్నేని రాజా అన్నారు.కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం వెల్దిపాడు పిఎసిఎస్ లో సోమవారం త్రీ మెన్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. వెల్దిపాడు సొసైటీ చైర్ పర్సన్ గా నెక్కలపూడి రాజమన్నార్, కమిటీ సభ్యులుగా కొట్నాని శ్రీనివాసరావు, పాతూరి శివరాం లు నియమితులయ్యారు. వీరికి కేడీసీసీ ఉంగుటూరు బ్రాంచ్ మేనేజర్ పఠాన్ షరీఫ్ నియామక పత్రాలు అందజేశారు. వెల్దిపాడు సొసైటీకి చైర్ పర్సన్ గా నియమితులైన నెక్కలపూడి రాజమన్నార్ ను,కమిటీ సభ్యులను అభినందించారు.ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాసర్నేని రాజా మాట్లాడుతూ సహకార సంఘాల పాలకవర్గాలు నిత్యం రైతులకు అందుబాటులో ఉండి రైతాంగ సమస్యలు పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. అలాగే సంఘం బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొలుసు రవీంద్ర, ఉంగుటూరు సర్పంచ్ కాటూరి వరప్రసాద్, నాయకులు పోతినేని రామకృష్ణ,నెక్కలపూడి వెంకట అప్పారావు, కొట్నాని మోహన్ రావు వెంకయ్య,గొంగాడ సాంబశివరావు, గన్నవరం ఏఎంసీ మాజీ డైరెక్టర్ బొకినాల కిరణ్ వెన్నోతల తొట్టగుంట నాగవరప్పాడు వెల్దిపాడు గ్రామాల రైతులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధితో పేదలకు ఆర్థిక చేయూత

- మైలవరం మండలంలోని 44 మందికి రూ.24,96,737లు



**మైలవరం, ఆగస్టు 19(జర్నలిస్ట్‌ఫైల్):** సీఎం సహాయనిధితో పేదలకు ఆర్థిక చేయూత లభిస్తుందని, కష్టాల్లో ఉన్న ప్రజల ఆర్థిక భరింపును తగ్గించి, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సాయం అందించటమే దీని ముఖ్య ఉద్దేశ్యమని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మైలవరం మండలంలోని 44 మందికి రూ.24,96,737లు తాజాగా మంజూరయ్యాయి.మర్సుమల్లి, పొందుగల, గణపవరం, మైలవరం, పోరాటనగర్ తదితర గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సోమవారం మైలవరంలోని శాసనసభ్యుని కార్యాలయంలో అందజేశారు.ఈ సంధర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా 172 మందికి సీఎంఆర్ఎఫ్ కింద రూ.94, 96,795ల విలువైన రీ ఎంబర్స్ మెంట్ చెక్కులు, 28 మందికి రూ.45.50 లక్షల విలువైన ఎల్.ఓ.సిలు మంజూరైనట్లు పేర్కొన్నారు. వీటిని లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రికార్డు స్థాయిలో సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థికసాయం మంజూరు అయినట్లు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కృష్ణప్రసాదుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# మీ పనితీరు భేష్.. అందుకే ఈ పురస్కారం





- టీమ్ ఎన్‌టీఆర్ కృషితో ఎన్నో మెగా ఈవెంట్లను విజయవంతం చేశాం
- మొత్తం 376 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, ఆగస్టు 19(జర్నలిస్ట్‌ఫైల్):** జిల్లా అధికారుల సమష్టి కృషితోనే ఎన్నో మెగా ఈవెంట్లను విజయవంతంగా నిర్వహించగలిగామని.. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో ఉత్తమ ఫలితాల సాధనకు సమర్థవంతమైన అధికారులు, సిబ్బంది పాత్ర కీలకమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన 376 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. మున్ముందు ఇదే స్ఫూర్తితో పనిచేసి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావడంలో భాగస్వాములు కావాలంటూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ విజయవాడ నగరంలో గత ఏడాది కాలంలో ఎన్నో భారీ కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని.. ఒకవైపు ఆయా శాఖల కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తూనే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అహర్నిశలు కృషిచేశారని పేర్కొన్నారు. ఈ రోజు అవార్డులు అందుకున్న ప్రతిఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధిలో గౌరవ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, కళాకారులు ఇలా ప్రతిఒక్కరి భాగస్వామ్యం ఉందని.. ఈ సందర్భంగా వారి సేవలను గుర్తుచేసుకోవాల్సిన అవసరముందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

**అవార్డుల గ్రహీతలు**

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్‌డీవో కె.మాధురికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం శాఖల వారీగా అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమం సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

**అవార్డులు పొందిన జిల్లా అధికారులు**

డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, జిల్లా పశుసంవర్థక అధికారి డా. ఎం.హనుమంతరావు, జెడ్‌పీ సీఈవో కె.కన్నమనాయుడు, సీపీవో వై.శ్రీలత, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, డ్వామా పీడీ ఎ.రాము, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు, ఎల్‌డీఎం కె.ప్రియాంక, జిల్లా యువజన సంక్షేమ అధికారి యు.శ్రీనివాసరావు, డీటీసీ ఎ.మోహన్, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ టి.శ్రీనివాసరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.బాబ్జి, జిల్లా జైలు సూపరింటెండెంట్ మొహమ్మద్ ఇర్ఫాన్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి రుక్సానా సుల్తానా బేగం, జిల్లా ఉపాధి కల్పన అధికారి సీ.మధుభూషణరావు, జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్ ఎన్.షణ్ముగం, జిల్లా మత్స్య అధికారి సీఎస్ చక్రాణి, డీఎఫ్‌వో జి.సతీష్, గ్రౌండ్ వాటర్ డీడీ ఎం.నాగ మల్లేశ్వరరావు, హౌసింగ్ అధికారి ఎం.రజనీకుమారి, ఇరిగేషన్ ఎస్ఈ ఆర్.మోహనరావు, మెప్మా పీడీ పి.సాయిబాబు, జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి ఎ.శ్రీనివాస్‌కుమార్, జిల్లా మైనారిటీ అధికారి అబ్దుల్ రబ్బానీ, మైనారిటీస్ కార్పొరేషన్ ఈడీ ఫర్జానా బేగం, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు తదితరులు అవార్డులు పొందారు.

## మీ పనితీరు భేష్.. అందుకే ఈ పురస్కారం

### ఉత్తమ పనితీరు కనపరిచిన డీపీఆర్‌వో, డివిజనల్ పీఆర్‌వో, ఏవీఎస్ వీవీ ప్రసాద్

విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకుగాను జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. డీపీఆర్‌వో ఎస్‌వీ మోహనరావు, డివిజనల్ పీఆర్‌వో కె.రవి, ఏవీఎస్ వీవీ ప్రసాద్ కలెక్టర్ లక్ష్మీశ నుంచి అవార్డులు అందుకున్నారు.







# గురుకుల పాఠశాలలో ఉచిత మెడికల్ క్యాంప్

### రెసిడెన్సీయల్ బోర్డు మెంబర్ డాక్టర్ అన్నవరపువిజయ లక్ష్మీ



**గన్నవరం, ఆగష్టు 19(జర్నలిస్ట్‌ఫైల్):** కృష్ణా జిల్లా, గన్నవరం మండలం పూర్వ ముసునూరు ఏ పి గురు కుల విద్యార్థులు నేడు డాక్టర్లుగా ముసునూరు గురుకుల పాఠశాలలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించటం కోసం ALU MNI. అశోషియన్ వారు అడిగిన వెంటనే వారి స్వంత పనులు మానుకొని పాల్గొన్నా డాక్టర్లు ఉస్మానియా ఆసుపత్రిలో జనరల్ సర్జన్ డా శాంతి వర్ధిని, గైనకాలజిస్ట్ డా కవిత,శారద, బయోకెమిస్ట్ సీనియర్ డా అన్నవరపు ధన లక్ష్మీ,దంత వైద్యులు డా భాగ్య లక్ష్మీ డా సుధ ,మేము చెప్పిన వెంటనే వారికి ఆ పాఠశాలలో చదివిన దానికి రుణంగానూ, చేయాలనే తపనతో ఈ రోజు మెడికల్ క్యాంప్ నిర్వహించటం చాలా అభినందనీయం అని ఏ పి రెసిడెన్సీయల్ బోర్డ్ మెంబర్ ఈ పాఠశాల పూర్వ విద్యార్థిని డా అన్నవరపూ విజయ లక్ష్మీ, అన్నారు. ఆనాడు టీచరుగా పనిచేసి నేడు ప్రిన్సిపాల్ గా ఉన్నా లక్ష్మీ కుమారి మేడం ఉండటంతో పూర్వ విద్యార్థులు అందరుబడి బాట పడుతున్నారు అని ఆ పాఠశాలలో చెందిన మనలాంటి వారు కొందరు ఉన్నత స్థాయికి వెళ్ళారు వారుకూడా ఆ పాఠశాలకు కావలసిన కొని సదుపాయాలు మరియు విద్యార్థులకు అవేర్నెస్ ప్రోగ్రామ్ చేయటానికి ముందుకు రావాలని ఆమె పూర్వ విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు.విద్యార్థులు క్రమ శిక్షణ తో చదువుకొని మీ భవిష్యత్ కు బాట వేసుకోవాలని ప్రస్తుత విద్యార్థినిలు కు పిలుపునిచ్చారు. విద్యార్థినిలందరికీ స్టాఫ్ కు వైద్యం అందించిన నాతోటి పూర్వ విద్యార్థిని లు అందరికీ మరొక సారి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఉన్నాను అని అన్నారు.

# ఎదుగుతూ.. ఎదిగేలా చేయందిస్తాం






- పీ4లో భాగస్వాములైన వర్ధమాన్ వికాస్ సంస్థ
- 500 బంగారు కుటుంబాలకు మార్గదర్శిగా ముందుకొచ్చిన సంస్థ
- ఇదే బాటలో బిల్డర్స్ అసోసియేషన్

**విజయవాడ, ఆగస్టు 19(జర్నలిస్ట్‌ఫైల్):** సమాజాన్ని పేదరికం నుంచి దూరం చేయాలనే గొప్ప లక్ష్యంతో ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రారంభించిన పీ4 విధానంలో మేము సైతం భాగమవుతామంటూ ప్రతిరోజూ ఎంతోమందితో పాటు ఎన్నో సంస్థలు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నాయి. తాజాగా సోమవారం వర్ధమాన్ వికాస్ సంస్థ, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (విజయవాడ సెంటర్) వరుసగా 500 బంగారు కుటుంబాలు, 74 బంగారు కుటుంబాలకు మార్గద ర్శనం చేస్తామంటూ పీ4తో చేతులు కలిపాయి. ఈ మేరకు సంస్థల ప్రతినిధులు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశకు ఆసక్తిని తెలియజేస్తూ ప్రమాణ పత్రాలు అందించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి శూన్య పేదరికం కీలకమని.. సమాజంలో పేదరికం ఆనవాళ్లు లేకుండా చేసేందుకు ఆవిష్కృతమైన పీ4లో భాగస్వాములైనందుకు వర్ధమాన్ వికాస్ సంస్థ, బిల్డర్స్ అసోసియేషన్‌లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 6,102 మంది మార్గదర్శులు 53,370 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వెల్లడిం చారు. కార్యక్రమంలో వర్ధమాన్ వికాస్ సంస్థ సభ్యు లు సీతల్ జైన్, దీక్షిత్ జైన్, దీక్షిత్ చౌహాన్, ప్రవీణ్ జైన్, యోగేష్ జైన్, మోనికా జైన్, ప్రియా జైన్, స్తుతి జైన్, యష్మీ జైన్ తదితరులతో పాటు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విజయవాడ సెంటర్ ఛైర్మన్ జె.వెం కటేశ్వరరావు, సభ్యులు ఎన్‌టీ వెంకటేశ్వ రరావు, బి.రాఘవరావు, వి.వెంకటేశ్వరరావు, ఎన్.నరేంద్ర తదిత రులు భాగస్వాములయ్యారు.

# పార్లమెంటులో బిసి బిల్లు పెట్టండి



## బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ అవసరం

### ఢిల్లీలో భారీ ప్రదర్శన జరిపిన జాతీయ బిసి సంక్షేమ సంఘం

### మోడీ నాయకత్వంలోనే రిజర్వేషన్లు సాధిస్తాం: ఎంపి ఆర్ కృష్ణయ్య

**హైదరాబాద్, ఆగస్టు 19:** పార్లమెంట్‌లో బి.సి బిల్లు పెట్టి చట్టసభలలో బి.సిలకు 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలని, కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టాలని, బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేటు రంగంలో ఎస్సీ,ఎస్టీ, బిసిలకు రిజర్వేషన్లు పెట్టాలని జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్వర్యంలో ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన జరిపారు. ఈ మహాప్రదర్శనలో పార్లమెంట్ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలా వెంకటేష్, జిల్లపల్లి అంజి,పగిళ్ల సతీష్ తదితర బిసి సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పార్లమెంట్‌కు రావడంతో జంతర్ మంతర్ దద్దరిల్లిపోయింది. ఈ సందర్భంగా ఎంపి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ 'కేంద్రంలోని ప్రభుత్వం తొలిసారిగా జనగణనలో కులగణన చేపడుతుంది.కుల గణన తర్వాత బిసిలకు చట్టసభలలో 50 రిజర్వేషన్లు, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ, జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపెంపు వంటి నిర్ణయాలు కూడా తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.బి.సి.లు అన్ని రంగాలలో అభివృద్ధి మోడీ ద్వారానే జరుగుతుందన్నారు. బిసిలకు రిజర్వేషన్లను జనాభా గ్రూపులుగా వర్గీకరణ చేయడానికి జస్టిస్ రోహిణి అధ్యక్షతన కమిటీ నియమించారని, ఆ రిపోర్ట్ ప్రకారం గ్రూపులు చేస్తున్నారు.

అలాగే ప్రత్యేక సంక్షేమ పథకాల రూపకల్పన, అవసరమైన బడ్జెటు కేటాయింపు, కార్యాచరణ ప్రణాళిక అమలులో ముందడుగు వంటివాటికి మార్గం సుస్పష్టం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పంచాయతీరాజ్ సంస్థలో బి.సి. రిజర్వేషన్లను 22శాతం నుంచి 50 శాతంకు పెంచాలి.

ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలని కోరారు. బిసిల విద్యా, ఉద్యోగ, రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని, బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి. బిసిల అభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపొందించాలని, ఎస్సీ,ఎస్టీ అట్రా సిటీ యాక్ట్ మాదిరిగా బిసిలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి బిసి యాక్ట్ తీసుకురావాలని కోరారు.జడ్జీల నియామకాలలో ఎస్సీ,ఎస్టీ బిసిలకు రిజర్వేషన్లు పెట్టాలని, కేంద్రంలో బిసిలకు పోస్ట్ మెట్రిక్స్ స్కాలర్ షిప్,ఫీజు రియంబర్స్‌మెంట్ స్కీము విధానం సాచురేషన్ పద్ధతిలో ప్రవేశపెట్టాలి. రాష్ట్రాలకు 80 మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.కేంద్ర స్థాయిలో 2 లక్షల కోట్ల బడ్జెట్ బిసిసబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు.



సోమవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన రాధాకృష్ణన్

# ప్రధాని మోడీతో రాధాకృష్ణన్ భేటీ

## నేడు నామినేషన్ వేసే అవకాశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** మహారాష్ట్ర గవర్నర్, ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ ప్రధానమంత్రి నరేంద్రమోడీని సోమవారం కలుసుకున్నారు. ఎన్డీయే సమావేశాల్లో పాల్గొనేందుకు, పలువురు నేతలను కలుసుకునేందుకు రాధాకృష్ణన్ ఢిల్లీకి వచ్చారు. రాధాకృష్ణన్‌తో భేటీ తర్వాత ప్రధాని మోడీ ఆ వివరాలను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. 'రాధాకృష్ణన్‌ను కలుసుకున్నాను. ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఆయనకు నా అభినందనలు తెలియజేశాను. సుదీర్ఘ ప్రజాసేవ, అనుభవంతో ఆయన దేశ కీర్తిని పెంచారు. అదే అంకితభావంతో దేశానికి సేవలు కొనసాగించాలని కోరుకుంటున్నాను' అని ఆ ట్వీట్‌లో మోడీ పేర్కొన్నారు. కాగా, ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఈ నెల 20న రాధాకృష్ణన్ నామినేషన్‌వేసే అవకాశం ఉంది. మంగళవారం జరిగే ఎన్డీయే పార్లమెంటరీ సమావేశంలో ఆయనను సన్మానించనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఆదివారం జరిగిన పార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశం తర్వాత రాధాకృష్ణ పేరును సమావేశంలో ఎంపిక చేసినట్లు బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా ప్రకటించారు. ఏకగ్రీవంగా యానకు విపక్షాలు మద్దతు తెలపాలని కోరారు. గత వారంరోజులుగా విపక్ష నేతలతో బిజెపి నేతలు మాట్లాడుతున్నారని, తిరిగి వారిని కలుస్తారని చెప్పారు. సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగనుంది. ఈ నెల 21వ తేదీతో నామినేషన్ల గడువు ముగుస్తుంది.

## ఇండియా కూటమి అభ్యర్థిగా డిఎంకె నేత, ఎంపి తిరుచ్చి శివ!

### ఉపరాష్ట్రపతి ఎన్నిక

**చెన్నై, ఆగస్టు 19:** వచ్చే నెల 9న జరిగే ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి ఎన్‌డిఎ కూటమి తమ అభ్యర్థిని ప్రకటించిన విషయం తెలిసిందే. మహారాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ (67)ను తమ అభ్యర్థిగా బిజెపి పార్లమెంటరీ బోర్డు సమావేశంలో ఎంపిక చేసినట్లు కూటమికి నేతృత్వం వహిస్తున్న బిజెపి వెల్లడించింది. అయితే విపక్ష ఇండియా కూటమి కూడా తమ అభ్యర్థిని బరిలోకి దింపేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగానే ఇవాళ విపక్ష కూటమిపార్టీలు సమావేశమయ్యాయి. ఈ సమావేశంలో ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా డిఎంకె పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపి తిరుచ్చి శివ పేరును ఆ పార్టీ ప్రతిపాదించినట్లు సమాచారం. ప్రస్తుతం డిఎంకె కీలక భాగస్వామిగా ఉన్న విషయం తెలిసిందే. దీంతో రాజ్యసభ ఎంపి తిరుచ్చి శివను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా 'ఇండియా' కూటమి ప్రకటించే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాలుతెలిపాయి. తమిళనాడు నుంచి ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎన్‌డియే ప్రకటించడంతో అదే తమిళనాడు నుంచి డిఎంకె అభ్యర్థిని దించడం ద్వారా బిజెపి వ్యూహాన్ని తిప్పికొట్టాలని విపక్ష కూటమి భావిస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.


## అలాస్కా భేటీకి ఆ సూట్‌కేస్ తీసుకెళ్లిన బాడీగార్డులు!

**వాషింగ్టన్, ఆగస్టు 19:** తమ ఆరోగ్యానికి సంబంధించిన విషయాలు బయటకు చిక్కకుండా ప్రపంచ నేతలు జాగ్రత్తలు పాటిస్తుంటారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపుపై చర్చించేందుకు ఇటీవల అలాస్కాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయిన సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇలాంటి జాగ్రత్తే తీసుకున్నారట. పుతిన్ మలవ్యర్థాలను తీసుకెల్లడానికి ప్రత్యేకంగా ఓసూట్‌కేసును ఆయన బాడీగార్డులు మోసుకెళ్లారట. ఆ ఫ్రూఫ్ సూట్‌కేసులో వాటిని సేకరిస్తారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పుతిన్ ఎప్పుడు విదేశాల్లో పర్యటించినా ఇలావాటినిసేకరించి స్వదేశానికితీసుకెళతారని గతంలోనూవార్తలు వచ్చాయి.

**ఎందుకు సేకరిస్తారు?**

పుతిన్ విదేశాల్లో పర్యటించినప్పుడు ఆయన రక్షణ బాధ్యత ఫెడరల్ ప్రొటెక్షన్ సర్వీస్ నిర్వహిస్తుంది. పుతిన్‌తోపాటు ఇతర ప్రభుత్వ అధికారుల సంరక్షణనూ ఈ ఎఫ్‌పిఎస్ చూసుకుంటుంది. పుతిన్ కాలకృత్యాలకు వెళ్లిన ప్రతిసారి ఓ ఎఫ్‌ఎస్‌ఓ ఏజెంట్ (ఫెడరల్ గార్డ్ సర్వీస్) వ్యర్థాలను సేకరించి ఓ ప్రత్యేకమైన ప్యాకెట్‌లో భద్రపరుస్తారు. తర్వాత వాటిని ఓ సూట్‌కేసులో ఉంచి రష్యాకు తీసుకెళ్తారు. గతంలో ఫ్రాన్స్ పర్యటనలో పుతిన్ బాత్‌రూమ్‌కు వెళ్లినప్పుడు ఆయన వెంట ఆరుగురు బాడీగార్డులు తోడుగా ఉన్నారు. అందులో ఒక వ్యక్తి చిన్న సూట్‌కేసును తీసుకొని బాత్‌రూమ్ నుంచి బయటకు వచ్చినట్లు ఉన్న విడియో గతంలో వైరల్‌అయింది. వ్లాదిమిర్ పుతిన్ ఆరోగ్య రహస్యాలు విదేశీ గూఢచారులకు చిక్కకుండా ఉండేందుకు క్రెమ్లిన్ ఇటువంటి జాగ్రత్తలు తీసుకుంటుందని పలు కథనాలు వెల్లడించాయి.

# యుద్ధం ముగింపు నమ్మేటట్లు ఉండాలి



## ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

**కీవ్, ఆగస్టు 19:** రష్యాతో జరుగుతున్న యుద్ధాన్ని ప్రపంచం నమ్మేలా ముగించాలి అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడితో శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు ఆయన సోమవారం సాయంత్రం వాషింగ్టన్ డిసికి చేరుకొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్, ఐరోపా నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'యుద్ధం ముగియాలనే బలమైన మా ఆకాంక్షను తెలియజేశాం. ఉక్రెయిన్‌ను రక్షించుకొంటానన్న నమ్మకం నాకుఉంది. అదే సమయంలో మా భద్రతకు హామీ కూడా పొందుతానని భావిస్తున్నాను. రష్యా ప్రారంభించిన యుద్ధాన్ని అదే ఆపేయాలి' అని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు.గతంలో అంతగా ప్రయోజనం లేని సెక్యూరిటీ గ్యారెంటీ కాకుండా.. ఈసారి భద్రతకు బలమైన హామీ ఇవ్వాలని జెలెన్‌స్కీ కోరారు. ఉక్రెయిన్‌వాసులు వారి భూమి, స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నారన్నారు. అమెరికా, ఐరోపా నుంచి వచ్చే ఒత్తిడితో రష్యా శాంతి ఒప్పందం వైపు మళ్లుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**వాటిని మర్చిపోవాల్సిందే.. : ట్రంప్**

అంతకుముందే ట్రంప్ జెలెన్‌స్కీకి పూర్తిగా భిన్నమైన ప్రకటనచేశారు. ఈ మేరకు ఆయన ట్రూత్‌లో పోస్టుచేశారు. 'ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ తక్షణమే యుద్ధం విరమించవచ్చు లేదా కావాలనుకుంటే కొనసాగించవచ్చు. కానీ, ఒబామా ఇచ్చేసిన క్రిమియాను మాత్రం తిరిగి పొందలేరు. మరో విషయం ఉక్రెయిన్ నాటో సభ్యత్వం పొందలేదు. కొన్నివిషయాలను మార్చలేము' అని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. జెలెన్‌స్కీ-ట్రంప్ మధ్య గతంలో వివాదం జరిగిన నేపథ్యంలో ఈసారి భేటీకి పెద్దఎత్తున ఐరోపా, నాటో నేతలు తరలివచ్చారు. బ్రిటన్ ప్రధాని స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, ఇటలీప్రధాని మెలోని, ఫిన్లాండ్ ప్రధాని అలెగ్జాండర్‌స్టబ్, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్, నాటోచీఫ్ మార్క్ రుట్టె పాల్గొనున్నారు.

**మాకూ సెక్యూరిటీ గ్యారెంటీ కావాలి: రష్యా**

భవిష్యత్తులో జరగబోయే శాంతి ఒప్పందంలో తమకు కూడా సెక్యూరిటీ గ్యారెంటీ కావాలని రష్యా పేర్కొంది. ఈ మేరకు రష్యా ప్రతినిధి మిఖాయిల్ ఉల్యానోవ్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. 'చాలా ఐరోపా దేశాలు భవిష్యత్తు శాంతి ఒప్పందంలో ఉక్రెయిన్ శాంతికి హామీ ఇవ్వాలని కోరుకుంటున్నారు. దీనికి రష్యా అంగీకరిస్తుంది. కానీ, అదే రక్షణ హామీ మా దేశానికి కూడా అవసరమే' అని పేర్కొన్నారు.

## కాశ్మీర్‌లో భద్రతా బలగాలకు సవాల్ విసురుతున్న బెడ్‌రూం జిహాదీలు

**హైదరాబాద్, ఆగస్టు 19:** కాశ్మీర్‌లో ఉగ్రవాదులతో పోరాడుతున్న భద్రతా బలగాలకు కొన్నిరోజులుగా కొత్తసమస్య వచ్చి పడింది. ఫలానా ప్రాంతంలో రెండు వర్గాల మధ్య గొడవలు తలెత్తాయని, ఈ గొడవల్లో కొందరు చనిపోయారని, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారని, గొడవలను అదుపు చేయడంలో పోలీసులు విఫలమయ్యారని సోషల్ మీడియాలో వస్తున్న వరుస కథనాలు కాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సోషల్ మీడియాలోవస్తున్న ఈ కథనాలను పాక్‌ప్రేరితఉగ్రవాదులకు సానుభూతి పరులుగా వుంటున్న కొందరు యువకులు తమ ఇంట్లో కూర్చుని వ్యాపింప చేస్తున్నట్లు భద్రతా బలగాలు గుర్తించాయి. ఈ క్రమంలోనే వీటికి బెడ్‌రూం జిహాదీలుగా పేరు ఏర్పడింది. కాశ్మీర్ అంతటా ఈతరహా కార్యక్రమం పెరిగే అవకాశాలున్నాయని గుర్తించిన నిఘావర్గాలు పోలీసులను అప్రమత్తం చేశాయి. ఇందుకోసం ఉగ్రవాద సానుభూతిపరులు నకిలీ ఖాతాలను తెరిచి వాటి ద్వారా తప్పుడు కథనాలను వ్యాపింప చేస్తున్నట్లు నిఘా వర్గాలు నిర్ధారణకు వచ్చాయి. ఉగ్రవాదులకు సానుభూతి పరులుగా వున్న యువకులకు పాక్‌లోని ఉగ్రవాద సంస్థల నుంచి నిధులు అందుతున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి, దాదాపు రెండు నెలలుగా కాశ్మీర్‌లో కొనసాగుతున్న బెడ్‌రూం జిహాదీ ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలని భద్రతా బలగాలకు కేంద్ర హోంశాఖ ఆదేశించింది. వేల సంఖ్యలో సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు కథనాలను వెంటనే నియంత్రించాలని భద్రతా బలగాలకు కేంద్ర హోం శాఖ ఆదేశించింది. వీరికి పాక్‌లోని హ్యాండర్లకు సంబంధం వుందని కేంద్ర హోం శాఖకు ఆధారాలు లభించాయి. కంప్యూటర్లు స్మార్ట్ ఫోన్ల సహాయంతో జిహాదీలు ఎక్కడపడితే అక్కడి నుంచి సోషల్ మీడియాలో పోలీసులను టార్గెట్‌చేస్తూ ఆయా ప్రాంతాలలలో అల్లర్లు చెలరేగాయని, అశాంతి నెలకొందని తప్పుడు కథనాలను ప్రసారం చేస్తున్నారు.

# కొనుగోలుదార్లను వెతుక్కుంటూ రష్యా సహజవాయువు నౌకలు



## అమెరికా ఆంక్షల నేపథ్యం

**మాస్కో ఆగస్టు 19:** అమెరికా ఆంక్షలకు గురైన రష్యాలోని ఓ సహజవాయువు కేంద్రం నుంచి రెండు ట్యాంకర్లు కొనుగోలుదార్లను వెతుక్కుంటూ ఆసియాకు బయల్దేరాయి. ఓవైపు వాషింగ్టన్‌లో శాంతిచర్చల వేళ.. ఈ ద్రవీకృత సహజవాయువు (ఎల్‌ఎన్‌జి) సరఫరా చేస్తున్న భారీ నౌకలు ఆసియ వైపు రావడం చర్చనీయాంశంగా మారింది. ది ఐరిస్, వోస్కోడ్ నౌకలు సైబీరియాలోని ఆర్కిటిక్ ఎల్‌ఎన్‌జి-2 ప్లాంట్ నుంచి ఉత్తర ఆసియాకు బయల్దేరాయి. ఉత్తర సముద్ర మార్గంలో ప్రయాణం మొదలుపెట్టాయని బ్లూమ్‌బెర్గ్‌షిప్ ట్రాకింగ్ డేటా వెల్లడిస్తోంది. వాస్తవానికి ఈ ట్యాంకర్లు కొన్ని నెలలపాటు సముద్రంలో ఖాళీగా ఉన్నాయి.

ఆర్కిటిక్-2 ప్లాంట్‌ను నోవాటెక్ పిజెస్‌సి నిర్వహిస్తోంది. 2030 నాటికి రష్యా గ్యాస్ ఎగుమతులను మూడింతలు చేయాలన్న లక్ష్య సాధనకు ఈ కంపెనీ అత్యంత కీలకమైంది. ఐరోపా నుంచి పైప్‌లైన్‌లో గ్యాస్ కొనుగోళ్లు తగ్గాక ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తూ మాస్కో ఈ లక్ష్యాన్ని ఎంచుకుంది. ఆర్కిటిక్-2 ప్లాంట్ గత వేసవిలో దాదాపు ఎనిమిది కార్గోలను ఎగుమతి చేసింది. కానీ, అక్టోబర్ నాటికి మంచు తీవ్రం కావడంతో కొనుగోలుదారులు దొరక్క ఉత్పత్తి నిలిపివేసింది. ఈ ప్లాంట్‌పై బైడెన్ కార్యవర్గం ఆంక్షలు విధించింది. ఆర్కిటిక్-2 ఈ యేడాది జూన్‌లో తిరిగి నౌకల్లో ఎల్‌ఎన్‌జి నింపడం మొదలుపెట్టింది. ఇప్పటివరకు అక్కడి నుంచి బయల్దేరిన నౌకలు ఏ పోర్టులోనూ ఆగలేదు. ఇక్కడి నుంచి ఆసియాకు బయల్దేరిన నాలుగు నౌకలు కొనుగోలుదారులను వెతుక్కుంటూ ఆసియాకు బయల్దేరాయి. మంచులో ప్రయాణించే మరో డజన్ నౌకలను ఆర్కిటిక్-2 కోసం సిద్ధంగా ఉంచారు. రష్యా నుంచి చమురు, సహజవాయువు అత్యధికంగా కొనుగోలు చేస్తున్న దేశాల్లో భారత్, చైనా ముందు వరుసలో ఉన్నాయి. ఇప్పటికే న్యూఢిల్లీపై వాషింగ్టన్ పెనాల్టీలు విధించిన విషయం తెలిసిందే.

# ముంబయి గణేశుడి మండపానికి రూ.474 కోట్ల ఇన్సూరెన్స్!



**ముంబయి, ఆగస్టు 19:** యావత్ భారతదేశం గణపతి నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమవుతోంది. విభిన్న ఆకృతుల్లో కొలువుదీరే వినాయకుల కోసం అంతటా మండపాలను ముస్తాబు చేస్తున్నారు. ప్రతియేటా ఖరీదైన గణేశుడి విగ్రహాలు, భారీ సెట్టింగ్‌లతో ఏర్పాటయ్యే తాత్కాలిక మండపాలు ఆకర్షణగా నిలుస్తుంటాయి. ఏదైనా జరిగితే భారీగా నష్టపోకుండా కొన్ని మండపాలకు ఇన్సూరెన్స్ చేస్తారు. ఈ నేపథ్యంలోనే ముంబైలోని ఓ గణేశుడి మండపానికి కూడా ఏకంగా రూ.474.46 కోట్లకు ఇన్సూరెన్స్ చేయించారు. ఈ మేరకు ఓ జాతీయ మీడియా సంస్థ కథనాన్ని ప్రచురించింది. ముంబై శివారులోని మతుంగా ప్రాంతంలో గత ఏడు దశాబ్దాలుగా జీఎస్‌బి సేవామండల్ వినాయక చవితి వేడుకలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నది. ఈసారి 71వ వార్షికోత్సవం జరగనుంది. దేశంలోనే సంపన్న వినాయకుడిగా పేరొందిన ఈ విఘ్నేశ్వరుడి వేడుకలకు ఈ ఏడాది ఏకంగా రూ.474.46 కోట్లతో బీమా చేయించారు. ఇక్కడి విగ్రహాన్ని భారీ ఎత్తున బంగారం, వెండి ఆభరణాలతో అలంకరించనుండటమే అందుకు కారణం.

గత ఏడాది సైతం ఈ గణేష్ మండపానికి రూ.400.58 కోట్లతో బీమా చేయించినట్లు నిర్వాహకులు మీడియాకు వెల్లడించారు. ఇప్పుడు బంగారం, వెండి ధరలు పెరగడంతో బీమా విలువను కూడా పెంచారు. అందులో పూజారులు, నిర్వాహకులు, సహాయకులు, భద్రతా సిబ్బందికి రూ.375 కోట్లతో వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకున్నారు. గణపయ్యకు అలంకరించే బంగారం, వెండి ఆభరణాలకు రూ.67 కోట్లతో బీమా చేయించారు. 2023, 2024 సంవత్సరాల్లో గణపయ్య ఆభరణాలకు వరుసగా రూ.38 కోట్లు, రూ.43 కోట్లు బీమా కవరేజ్ తీసుకున్నారు. అంతేగాక అగ్నిప్రమాదం, భూకంపం ముప్పు వంటి వాటికోసం ప్రత్యేకంగా మరో రూ.2 కోట్ల బీమా చేయించారు. అక్కడి ఫర్నీచర్‌కు, కంప్యూటర్‌లు, సిసిటివిలు, స్కానర్‌లు ఇన్సూరెన్స్ పరిధిలో ఉన్నాయి. పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్ కింద రూ.30 కోట్లు కేటాయించారు. భక్తుల సౌలభ్యంకోసం క్యూఆర్ కోడ్, డిజిటల్ లైవ్ సేవలను కూడా నిర్వాహకులు అందుబాటులోకి తెచ్చారు. భద్రతా చర్యల్లో భాగంగా ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు.

## సంక్షిప్తంగా..

### నిరుపయోగంగా 13 కోట్ల జనధన్ ఖాతాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** దేశవ్యాప్తంగా 56.04 కోట్ల పిఎం జన్‌ధన్ ఖాతాల్లో దాదాపు 23 శాతం నిరుపయోగంగా ఉన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్‌చౌదరీ వెల్లడించారు. ఈ యేడాది జూలై 31 నాటికి 13.04 కోట్ల జన్‌ధన్ ఖాతాలు ఇన్‌ఆపరేటివ్‌లో ఉన్నట్లు లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ఇటువంటి ఖాతాలు అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో (2.75 కోట్లు) ఉన్నట్లు చెప్పారు. బీహార్ (1.39 కోట్లు), మధ్యప్రదేశ్ (1.07 కోట్లు) రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఆర్బీఐ నిబంధనల ప్రకారం.. ఒక పొదుపు ఖాతాలో వినియోగదారుడి తరపు నుంచి రెండేళ్లకుపైగా ఎలాంటి లావాదేవీలు జరగకపోతే వాటిని ఇన్‌ఆపరేటివ్ ఖాతాగా పరిగణిస్తారు. 'యుపిఐ సేవలు సజావుగా సాగేందుకు కేంద్ర ప్రభుత్వం గత నాలుగు ఆర్థిక సంవత్సరాలల్లో దాదాపు రూ.8,730 కోట్ల ప్రోత్సహకాలు అందించింది' అనిచెప్పారు. 2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేద భారతీయులకు సైతం బ్యాంకు బ్యాంకు ఖాతా సౌకర్యంకల్పించడానికి ప్రధానమంత్రి జన్‌ధన్‌పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకాన్ని ప్రారంభించి పదేళ్ల పూర్తయిందని, పెద్ద సంఖ్యలో ఖాతాలకు రీ-కెవైసి చేయాల్సి ఉందని ఇటీవల గవర్నర్ సంజయ్‌మల్హోత్రా వెల్లడించారు. రీ-కెవైసికి ఈయేడాది సెప్టెంబరు 30వరకు గడువు ఉందన్నారు.

### ఢిల్లీలో పలు స్కూళ్లకు బాంబు బెదరింపులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** దేశ రాజధాని ఢిల్లీలో బాంబు బెదరింపులు మరోసారి కలకలం రేపాయి. సోమవారం ఉదయం నగరంలోని పలు విద్యాసంస్థలకు ఇలాంటి బెదరింపులే వచ్చాయి. ద్వారకా ప్రాంతంలోని రెండు పాఠశాలలు, ఓ కళాశాలకు ఉదయం బాంబు బెదరింపులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఇ మెయిల్ ద్వారా ఆయా విద్యా సంస్థలకు బెదరింపులు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. సోమవారం ఉదయం 7:24 గంటల సమయంలో బాంబు బెదరింపులకు సంబంధించిన సమాచారం తమకు అందినట్లు ఢిల్లీ ఫైర్ డిపార్ట్‌మెంట్ తెలిపింది. సమాచారం అందగానే ఢిల్లీ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఆయా విద్యాసంస్థల వద్దకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో పాఠశాలలు, కళాశాల ప్రాంగణంలో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. అయితే ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు లభించలేదు.

### ఫుడ్‌పాయిజనింగ్: 100 మంది సినీకార్మికులకు అస్వస్థత

**లేహ్, ఆగస్టు 19:** జమ్మూకశ్మీర్‌లోని లేహ్‌లో కలుషిత ఆహారం తిని 100 మంది సినీ కార్మికులు అస్వస్థత గురయ్యారు. ప్రస్తుతం ఆ ఫిల్మ్ యూనిట్ వర్కర్ల ఆరోగ్యం స్థిరంగా ఉన్నట్లు అధికారులు చెప్పారు. ఆదివారం రాత్రివేళ ఎస్ఎన్ఎం ఆస్పత్రికి ఆ పేషెంట్లకు తీసుకువచ్చారు. తీవ్రమైన కడుపునొప్పి, తలనొప్పి, వాంతులు అవుతున్నట్లు ఆ వర్కర్లు ఫిర్యాదు చేశారు. బాలీవుడ్ సినిమా షూటింగ్ కోసం ఆ బృందం లేహ్‌లో ఉన్నది. ఆ కార్మికులు ఎవరూ స్థానికులుకాదు. ఆ లోకేషన్‌లో సుమారు 600 మంది భోజనం చేసినట్లుతెలుస్తోంది. ఘటన జరిగిన ప్రదేశంనుంచి ఆహార శ్యాంపిళ్లను విశ్లేషణ కోసం సేకరించారు. ఫుడ్ పాయిజనింగ్ జరిగినట్లు ఆస్పత్రి డాక్టర్లు చెబుతున్నారు.

### రైలు ఢీకొని ముగ్గురు మహిళలు మృతి

**డిస్‌పూర్, ఆగస్టు 19:** అస్సాంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఉదయం నడకకు వెళ్లిన ముగ్గురు మహిళలను రైలు ఢీ కొట్టింది ఈ ప్రమాదంలో వారు ప్రాణాలు కోల్పోయారు. అస్సాంలోని బాముని‌గావ్ రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోకో గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు ఇవాళ ఉదయం మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. ఈ క్రమంలో రైలు పట్టాలు దాటుతున్న సమయంలో పూరి ఎక్స్‌ప్రెస్ రైలు వారిని బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. బాధిత మహిళలను రూమి దాస్ (55), కొరాబి మాలు (60), ఉత్తర దాస్ (60)గా గుర్తించారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### కేరళలోని పద్మనాభస్వామి ఆలయ కంప్యూటర్లు హ్యాక్

**తిరువనంతపురం, ఆగస్టు 19:** కేరళలోని శ్రీపద్మనాభస్వామి ఆలయం సైబర్ దాడికి గురైంది. ఆలయా నికి చెందిన కంప్యూటర్ వ్యవస్థ, సర్వర్ డేటాబేస్ హ్యాకైంది. ఆలయ నిర్వాహణ అధికారి.. సైబర్ పోలీసులకు ఈ అంశంపై ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు. జూన్ 13న హ్యాకింగ్ జరిగినట్లు ఎఫ్‌ఐఆర్‌లో ఉన్నది. టెంపుల్ ఆపరేషన్స్‌ను దెబ్బతీయాలన్న ఉద్దేశంతో కంప్యూటర్లను హ్యాక్ చేసినట్లు పేర్కొన్నారు. కంప్యూటర్లలో స్టోర్‌చేసిన కీలక సమాచారాన్ని ట్యాంపర్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతర్గత వివాదాల వల్ల హ్యాకింగ్ ఘటన జరిగి ఉంటుందని ప్రాథమిక విచారణ ద్వారా తెలుస్తోంది.

## ఆదరణ 3.0లో మత్స్యకారులకు ప్రాధాన్యం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** మత్స్యకారుల సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. వేట విరామ భృతిని రూ. 10 వేల నుంచి రూ. 20 వేలకి పెంచి 1.29 లక్షల మందికి రూ. 259 కోట్లు జమ చేసినట్టు పేర్కొన్నారు. లీటర్ డీజిల్‌పై రూ. 9 రాయితీ, ప్రమాదంలో మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు రూ. 10 లక్షల పరిహారం అందజేస్తున్నామని చెప్పారు. త్వరలో ప్రారంభమయ్యే ఆదరణ 3.0లోనూ మత్స్యకారులకు ఆధునిక పరికరాలు అందజేస్తామని వెల్లడించారు.

## రైతులకు యూరియా సమస్యను పరిష్కరించిన యార్డ్ చైర్మన్ జవ్వాది



- ఐటీ, విద్యా శాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ ఆదేశాల మేరకు సమస్యను పరిష్కారం

**మంగళగిరి టౌన్, (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి పరిసర ప్రాంతాల రైతులు యూరియా కొరత వలన ఇబ్బందులు పడుతున్నామని పంటలు కీలక దశలో ఉన్న ఈ సమయంలో యూరియా అందుబాటులో లేకపోవడం వలన రైతులు నేరుగా వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ను కలిసి తమ ఆవేదనను తెలియజేశారు.. మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ దృష్టికి చేరగానే ఆయన స్పందించి సంబంధిత అధికారులతో వెంటనే చర్చించి అవసరమైన యూరియా సరఫరా జరగేలా ఏర్పాట్లు చేశారు. అనంతరం లారీ ద్వారా యూరియాను తెప్పించి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలకు ఎప్పుడూ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని నియోజకవర్గ పరిధిలో వ్యవసాయ అవసరాల విషయంలో ఎటువంటి సమస్య వున్న ఐటీ, విద్యా శాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్ళి సమస్యలను పరిష్కరిస్తాం అని కిరణ్ చంద్ రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లో మండల వ్యవసాయ అధికారీ శైలజ, యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్ బాబు, పట్రా శ్రీనివాసరావు, జాలాది సందీప్, బొర్రా శ్రీకాంత్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన ప్రధాని మోదీ : డాక్టర్ చందు సాంబశివుడు



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్):** కేంద్రఎన్నికల కమిషన్, కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో పనిచేసిందని, ఓట్ల గల్లంతుకు పాల్పడిన ప్రధాని మోదీ ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసారని, ఈ విధానాలతో గెలిచి, అధికారం చాలాయిస్తున్న కూటమి ప్రభుత్వం తక్షణమే గద్దె దిగాలని ఇండియా కూటమి నాయకుడు, తెనాలి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త డాక్టర్ చందు సాంబశివుడు డిమాండ్ చేశారు ఇండియా కూటమి పిలుపుమేరకు తెనాలి పట్టణంలో, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. మంగళవారం మారీస్ పేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ప్రారంభమైన నిరసన ప్రదర్శన మార్కెట్ సెంటర్ లోని, మహాత్మాగాంధీ విగ్రవరకు, కొవ్వొత్తులతో ర్యాలీగా కొనసాగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గం కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అనైతిక విధానాలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. తమ నాయకుడు రాహుల్ గాంధీ , కేంద్ర ఎన్నికల కమిషన్ అనైతిక విధానాలపై, రాజీ లేకుండా పోరాడుతున్నారని, వారికి అండగా దేశవ్యాప్తంగా ఇండియా కూటమి ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ విధానాలను డాక్టర్ చందు సాంబశివుడు తమదైన శైలిలో విమర్శించారు. సిపిఐ నాయకులు చెరుకుమల్లి సింగారావు, సిపిఎం నాయకులు కేబి ప్రసాద్, ములక శివసాంబిరెడ్డి తదితర నాయకులు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం విధానాలను దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొన్నూరు శశి, సిపిఐ నాయకులు మద్దినేని కిరణ్ బాబు పాశం వెంకటేష్, భీమా రమేష్ ద్వారక శ్రీనివాస్ మల్లవరపు ప్రసాద్ పిల్లి ప్రభాకర్ కే కోటేశ్వరరావు బి రమేష్ సిహెచ్ అయ్యప్ప, తదితర ఇండియా కూటమి పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

## జ్ఞాపకాల దృశ్యరూపం ఫోటోగ్రఫీ



**తెనాలి ,(జర్నలిస్ట్ ఫైల్)** జీవన గమనంలొ గతం మిగిల్చిన జ్ఞాపకాల దృశ్య రూపమే ఫోటోగ్రఫీ అని మారుతున్న పరిస్థితులు కనుగుణంగా సెల్ ఫోన్ లొ, ఫొటోలు తీసినా, నాటి ఫోటో గ్రఫీ పనీతీరు గొప్పదని రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ ఫోటోగ్రాఫర్లను అభినందించారు. వరల్డ్ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో మంళవారం రోటరీ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన వరల్డ్ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్, ఈదర వెంకట పూర్ణచంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈకార్యక్రమానికి, క్లబ్ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్రావు అధ్యక్షత వహించగా తెనాలిలోని ప్రసిద్ధ ఫోటోగ్రాఫర్లు కోకటి నాగేశ్వరరావు, బిరుదు రాజు విజయరాజు, కన్నెగంటి మధు, తుళ్ళిమిల్లి చంటి లకు ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణ చంద్ మాట్లాడుతు ఫోటోగ్రఫీ ప్రాముఖ్యతను, నాటికి, నేటికి ఉన్న వ్యత్యాసాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో క్లబ్బు కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, కోశాధికారి వెంపటి హరిప్రసాద్, క్లబ్ సభ్యులు, సన్మాన గ్రహితల అభిమానులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బీసీలకు పుట్టినిల్లు తెలుగుదేశం పార్టీ - ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగుదేశం పార్టీ బీసీలకు పుట్టినిల్లు అని, బీసీలను రాజకీయంగా ప్రోత్సహించి, చట్ట సభల్లో అడుగు పెట్టటానికి కృషి చేసింది అన్న ఎన్టీఆర్ అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో యాదవ నేతల ఆత్మీయ సమావేశం జరిగింది. అనంతరం బీసీ నేతలు ఎమ్మెల్యే గళ్ళా మాధవిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో బీసీల అభివృద్ధి కోసం నేను ఎల్లప్పుడూ కృషి చేస్తాను. రాజకీయంగా ఎదగడానికి, సామాజికంగా ఎదగటానికి బీసీలకు అన్ని విధాల సహకారం అందిస్తాను" అని తెలిపారు. గతంలోనే బీసీ సంక్షేమం కోసం అసెంబ్లీలో పలు మార్లు బలంగా మాట్లాడానని, ముఖ్యంగా బీసీ భవన్ నిర్మాణం కోసం అసెంబ్లీలో తన వంతు కృషి చేసినట్లు పేర్కొన్నారు. "పీపీపీ (Public-Private Partnership) విధానంలో బీసీ భవన్ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని, సమాజ శ్రేయస్సు కోసం దాతలు, ప్రజలు, ప్రభుత్వం, నాయకులు కలసి పనిచేయడం వల్లే బీసీలకు స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుం దన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పీ-4 విధానం (People-Public-Private-Partnership) ప్రాధాన్యం గురించి ఎమ్మెల్యే ప్రస్తావించారు. ఈ విధానం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన పేద యాదవ కుటుంబాలను దత్తత తీసుకొని చేయూతనందించాలని కోరారు.

యాదవ సమాజం, బీసీల శ్రేయస్సు, అభివృద్ధి తన ప్రధాన లక్ష్యం అని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వారి గౌరవం, రాజకీయ ప్రాధాన్యం పెంపుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో తాళ్ళ వెంకటేశ్ యాదవ్, అడకా శ్రీనివాస్, తేలుకుట్ల హనుమాయమ్మ, అడకా పద్మావతి, గాలం వెంకటేశ్వర్లు, తెల్లగొర్ల అ-ప్పారావు యాదవ్, తుమ్మల నాగేశ్వరరావు, ఉప్పుటూరి పేరయ్య, గ్యాలం హనుమంతరావు, యర్రకుల శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఎఎన్‌యు ఫోటో గ్రాఫర్ గుత్తా సునీల్ కుమార్‌కు ఉత్తమ ఫోటోగ్రాఫర్ పురస్కారం

- ఇండియా ఇంటర్నేషనల్ ఫోటో గ్రాఫిక్ కౌన్సిల్&ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ప్రకటన
- "గిరిజన జీవనం" ను అద్భుతంగా చూపిన గుత్తా సునీల్ కుమార్
- గుత్తా సునీల్ కుమార్ ను అభినందిన ఎ ఎన్ యు సిబ్బంది





**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పాత్రికేయ విద్యా విభాగం లో దశాబ్దానికి పైగా ఫోటోగ్రాఫర్ గా విధులు నిర్వహిస్తున్న గుత్తా సునీల్ కుమార్ కు ఉత్తమ ఫోటోగ్రాఫర్ పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సాంస్కృతిక కమిషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రాఫిక్ కౌన్సిల్ , ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా వారు ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయి ఫోటో ప్రదర్శన లో "ట్రైబల్ ఫోటో ఆఫ్ ది ఇయర్ అవార్డు 2025"ను గుత్తా సునీల్ కుమార్ అందుకున్నారు. విజయవాడ లోని బాలోత్సవ్ భవన్ లో జరిగిన ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ,ప్రపంచ గిరిజన దినోత్సవం వేడుక కార్యక్రమం లో ఈ అవార్డు ను కార్యక్రమ ముఖ్య అతిథి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ,పాయ్ వైస్ ప్రసిడెంట్ డాక్టర్ కొంపల్లి సుందర్ ,ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక చైర్మన్ తమ్మా శ్రీనివాస రెడ్డి,అవనిగడ్డ శాసన సభ్యులు మాజీ డిప్యుటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్ ,మాజీ ఎంపీ డా. గోకరాజు గంగరాజు , టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సీఈఓ శ్రీ ఆర్. మల్లిఖార్జునరావు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు గొల్ల నారాయణరావు,వెంకటరమణ , ఉపాధ్యక్షులు డాక్టర్ కొంపల్లి సుందర్ వివిధ రాష్టాలకు చెందిన ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య నాగార్జున వర్సిటీలోని పాత్రికేయ విద్యా విభాగాధిపతి ఆచార్య డాక్టర్ కే జ్యోతిర్మయి,డాక్టర్ జె మధుబాబు తదితరులు అభినందించారు. వర్సిటీ తాత్కాలిక ఉపకులపతి కె గంగాధర రావు,రెక్టార్ ఆచార్య కె రత్న షీలా మణి, తాత్కాలిక రిజిస్ట్రార్ జి సింహాచలం, దూరవిద్యా కేంద్ర సంచాలకులు ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు వర్శిటీ సిబ్బంది ప్రశంసించారు.

## విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యుత్ చౌర్యం అరికట్టేందుకు విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం విస్తృత తనిఖీలు నిర్వహించింది. మంగళవారం సిఆర్‌డిఏ సర్కిల్ ఆపరేషన్ విభాగం పర్యవేక్షక ఇంజనీర్ ఎం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారని విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్. వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంజీవరావు సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. లింగాయపాలెం, ఎం.వి. పాలెం, మల్కాపురం, నేలపాడు, రాయపూడి, సకమురు, వెలగపూడి, వెంకటపాలెం ప్రాంతాల్లో 26 బృందాలతో 26 మంది అధికారులు, 85 మంది సిబ్బంది కలిసి 2086 సర్వీసులను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో మీటర్ లేకుండా నేరుగా విద్యుత్ వాడిన వారు, అనుమతించని కేటగిరీలో విద్యుత్ వినియోగించిన వారు, అనుమతించిన లోడ్ కంటే అధికంగా విద్యుత్ వాడిన వారు గుర్తించబడి, మొత్తం రూ. 3.05 లక్షల జరిమానా విధించారని వివరించారు. వినాయక చవితి సందర్భంగా డెకరేషన్ లైటింగ్ కోసం అవసరమైన లోడును ముందుగానే డిపార్ట్మెంట్‌కు తెలియజేసి, డీడీ రూపంలో చెల్లించి తాత్కాలిక సరఫరా పొందాలని అధికారులు సూచించారు. చెల్లించని పక్షంలో విభాగం నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ చట్టం సెక్షన్ 135 ప్రకారం మీటర్లు పనిచేయకపోయినా, సీలు లేకపోయినా లేదా ఉద్దేశపూర్వకంగా తొలగించినా విద్యుత్ చౌర్యంగానే పరిగణిస్తామని విజిలెన్స్ అధికారులు స్పష్టం చేశారు. మొదటిసారి తప్పిదం పట్టుబడిన వారికి కాంపౌండింగ్ విధానంలో తప్పించుకునే అవకాశం ఉన్నప్పటికీ, రెండవసారి అదే తప్పిదం పునరావృతమైతే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతామని హెచ్చరించారు. జరిమానా చెల్లించని పరిస్థితుల్లో రెవెన్యూ రికవరీ చట్టం కింద ఆస్తులు జప్తు చేసే అవకాశం ఉందని తెలిపారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని అధికారులు పేర్కొంటూ, ప్రజలు కూడా చౌర్యంపై ఫిర్యాదులను నేరుగా లేదా వాట్సాప్ ద్వారా 9440812263, 9440812360, 9440812361 నంబర్లకు అందించవచ్చని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ఈ తనిఖీల్లో డి.ఇ.ఈ. కే. రవికుమార్, ఎన్. మల్లిఖార్జున ప్రసాద్, ఎస్. శ్రీనివాసరావు, కె.వి. కోటేశ్వరరావు, ఏ.ఈ.లు కోటేశ్వరరావు, ఎం. సతీష్ కుమార్, యు. శివశంకర్, ఆపరేషన్ ఏ.ఈ. వి. ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరులో అనధికార లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వం అనధికార లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం%-%2020ను మరోసారి పొడిగిస్తూ జీ.ఓ.ఎం.ఎస్.నెం.134 సవరణ ఉత్తర్వులు జారీ చేసినట్లు గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు జూన్ 30, 2025 లోపు ఏర్పడిన అనధికార లే అవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే వీలుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ పథకం కింద నిర్ణీత అపరాధ రుసుముతో పాటు సాధారణంగా 14 శాతం ఉండే ఓపెన్ స్పేస్ రుసుముకు బదులుగా కేవలం 7 శాతం మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ వివరించారు. లైసెన్సు సర్వేయర్లు, ఇంజనీర్లు లేదా ఆర్కిటెక్ట ద్వారా ప్లాన్‌లు సిద్ధం చేయించి, అపరాధ రుసుములో 50 శాతం (లేదా కనీసం రూ. 10వేలు) చెల్లించి అక్టోబర్ 24లోపు ఆన్లైన్లో http://lrsdtcp.ap.gov.in/

## వివాహిత ఆత్మహత్య కేసులో ఐదుగురు అరెస్ట్



**తాడేపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** అధిక వడ్డీ వసూళ్లు, బెదిరింపులు, లైంగిక వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత కేసులో ఐదుగురిని తాడేపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ పర్యవేక్షణలో తాడేపల్లి సీఐ వీరేంద్ర బాబు నేతృత్వంలోని బృందం మంగళవారం ఉదయం ఉండవల్లి సెంటర్ వద్ద నిందితులను పట్టుకొని కోర్టులో హాజరు పరిచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది.

పోలీసుల వివరాల ప్రకారం, మృతురాలు అద్దంకి కృష్ణవేణి (37, నులకపేట) భర్త జయకృష్ణ తేజ 2016లో నిందితులు దుక్కా వేణుగోపాల్, శ్రీనివాసరావుల వద్ద రూ. 50 వేల అప్పు తీసుకున్నారు. అప్పు తీర్చినప్పటికీ నిందితులు అధిక వడ్డీ పేరుతో రూ. 15 లక్షలకు పైగా వసూలు చేశారు. తరువాత కూడా అప్పు ఇంకా మిగిలిపోయిందంటూ ఒత్తిడి చేస్తూ, ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు తీసుకొని పలుమార్లు మృతురాలిని బెదిరించారు. ఇక నిందితులు వేణుగోపాల్, బచ్చి ప్రసాద్ మృతురాలిని లైంగికంగా వేధించారని ఆమె రాసిన సూసైడ్ నోట్, మొబైల్ ఫోన్‌లో రికార్డ్ చేసిన సెల్ఫీ వీడియోల ద్వారా బయటపడింది. ఈ నిరంతర వేధింపులు, అవమానాలు తట్టుకోలేక కృష్ణవేణి ఆగస్టు 14న ఎలుకల విషం తాగి ఆత్మహత్యకు యత్నించగా, చికిత్స పొందుతూ ఆగస్టు 15న తెల్లవారుజామున మరణించారు.

కేసు నమోదు చేసి పూర్తి స్థాయి దర్యాప్తు జరిపిన పోలీసులు సాక్ష్యాధారాలు సేకరించి, నిందితులను గుర్తించారు. వీరిని ఆగస్టు 19న ఉదయం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

మృతురాలు : అద్దంకి కృష్ణవేణి W/o నాగకృష్ణ తేజ, వయసు 37 సం., నులకపేట గ్రామం.

**నిందితులు :** దుక్కా వేణుగోపాల్ (51), దుక్కా శ్రీనివాసరావు (45), సన్నిధి బచ్చి ప్రసాద్ (43), బంకుపల్లి రామకృష్ణ శర్మ (51), విశ్వనాథ రవికుమార్ (52) – అంతా విజయవాడకు చెందినవారు.

## డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరుస్తాం



- శాశ్వత పరిష్కారానికి చర్యలు
- బైపాస్ వద్ద డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనారిటీ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు. స్థానిక బైపాస్ వద్ద డ్రైనేజీ వ్యవస్థను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. గుంటూరు నుంచి వచ్చే నాలుగు డ్రైనేజీల నీరు గుంటూరు బైపాస్ వద్ద సరైన ప్రవాహం లేక పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. స్థానికులు ఎమ్మెల్యే నసీర్ దృష్టికి తీసుకురావడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. గుంటూరు నుంచి వచ్చే మురుగు నీటి ప్రవాహానికి బైపాస్ దాటి వెళ్లేందుకు కేవలం వంతెన మాత్రమే నిర్మించాలని తెలిపారు. దీనిని మార్చే విషయంపై నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సంప్రదిస్తామని ఈ సందర్భంగా ఆ ప్రాంతవాసులకు హామీ ఇచ్చారు. ఇప్పటికే గుంటూరు నగరంలోని డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. మొండిగేటు వద్ద అదనపు వెంట్ వే నిర్మాణాన్ని చేపడుతున్నామని వెల్లడించారు. గత ఐదేళ్లలో చిన్న చినుకు పడితే అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యేవని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక డ్రెయినేజీలు, ఆర్వోబీల నిర్మాణాలు చేపట్టామని తెలిపారు.

## రేపు సహకార బ్యాంక్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న వై సాంబశివారెడ్డి



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** సోమిరెడ్డిపల్లి సహకార సంఘం అధ్యక్షులుగా ఎల్లటూరు సాంబశివారెడ్డి రేపు అనగా గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం తహసిల్దార్ కార్యాలయం ప్రాంగణం లో ఉన్నటువంటి సోమిరెడ్డి పల్లె సహకార సంఘం కార్యాలయం నందు 12.30 గంటలకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ విచ్చేయుచున్నారు. ఈ సందర్భంగా కాబోయే చైర్మన్ సాంబశివారెడ్డి మాట్లాడుతూ నా ప్రమాణ స్వీకారానికి మండలంలోని ప్రజలు అభిమానులు రైతులు బంధువులు అందరూ తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

## కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం మహా గురుకులంలో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు:- సిపిఐ



**బ్రహ్మంగారి మఠం ఆగస్టు 19(జర్నలిస్ట్ ఫైల్)** బ్రహ్మంగారి మఠం మండలంలోని తోట్లపల్లి మహా గురుకులంలో విద్యార్థుల ఉంటున్న వసతిగృహం చుట్టూ ఉన్న మురికిని తొలగించటంలో అధికారులు మరియు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల కార్యదర్శి పెద్దల్లపల్లి ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం గురుకుల పాఠశాలను సిపిఐ బృందం పరిశీలించి సమస్యలు తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ……,. విద్యార్థుల వసతి గృహము నిర్మాణంలో నాసిరకమైన సిపివిసి నాసిరకమైన ప్లాస్టిక్ పైపులు అమర్చి అవి పూర్తిస్థాయిలో భూమిలో పూడ్చకుండా బయటే ఆమర్చినారని మరుగుదొడ్డి పైపు ప్రహరీ గోడ అవతలి వైపు వేయకుండా లోపలివైపే చెక్ డాం కీ కనెక్ట్ చేశారని ఆ కనెక్టింగ్ పైపులు భూమిలో పూడ్చకపోవడంతో ఎవరైనా రాయి వేస్తే పగిలేటట్లు ఉన్నాయని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించారని, అదేవిధంగా విద్యార్థుల స్నానం చేసిన నీరు బయటకు వెళ్లకుండా విద్యార్థుల భోజనశాల పక్కన కాలువకు మళ్లించడంతో అక్కడ దుర్వాసన ఎక్కువగా వస్తుంది. అదేవిధంగా భోజనశాల లో వేస్ట్ వాటర్ వెళ్లేందుకు భోజనశాల చుట్టూ కాలువ తీసి నీరు బయటకు వెళ్లేచోట చిన్న పైపు పెట్టడంతో మురికి నీరు చేరి భయంకరంగా దుర్వాసన వస్తూ విద్యార్థులను రోగాలకు గురిచేస్తుందని వసతి గృహానికి పాఠశాలకు మధ్యలో చెక్ డాం కాలువ తీశారని ఆ కాలువపై బండలు వేసి మూసివేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలన విద్యార్థులు కాలువలో పడే ప్రమాదం ఉందని అదేవిధంగా ట్రాన్స్ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయడంలో కరెంటు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, అదేవిధంగా విద్యార్థుల సౌకర్యార్థం హాస్టల్ వరకు వేసిన రోడ్డుకు ఇరువైపులా మట్టి తోలడంలో కూడా కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ఆరోపించారు. వర్షం వస్తే విద్యార్థుల వసతిగృహ మెట్లపైన నీరు ప్రవహిస్తుండటంతో విద్యార్థులు జారిపడే ప్రమాదముందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల హాస్టల్కు మరియు భోజనశాలకు సరఫర అయ్యే నీటి పైపులైను ఇప్పటికే పలుసార్లు పగిలిందని అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. దాదాపు 700 మంది కి పైగా విద్యార్థులు ఉన్న గురుకుల పాఠశాలకు కేవలం నలుగురు మాత్రమే వర్కర్స్ ఉన్నారని, విద్యార్థుల తరగతి గదులు కూడా 14 మాత్రమే ఉన్నాయని అవి కేవలం 560 మందికి మాత్రమే సరిపడతాయని ఆయన తెలిపారు. గురుకుల పాఠశాలకు హాస్టల్కు నాసిరకమైన నాణ్యతలేని పైపులు వాడడంతో వాల్స్ అన్ని ఒకేసారి తిప్పితే ఎక్కడికక్కడ పైపులు పగులుతున్నాయని నాసిరకమైన పనులు చేసిన కాంట్రాక్టర్ పై వారికి సహకరించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకొని విద్యార్థులు ఎదుర్కొనే ఇబ్బందులకు తక్షణ పరిష్కారం చూపాలని, అదేవిధంగా వర్కర్స్ ను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని, హాస్టల్ వరకు వేసిన రోడ్డు పునర్నిర్మించాలని, రోడ్డుకి ఇరువైపులా మట్టి తోలి విద్యార్థులకు దెబ్బలు తగలకుండా చూడాలని, భోజనశాల చుట్టూ ఉన్న కాలువను ప్రహరీ గోడ అవతలి వైపుకు మళ్ళించి విద్యార్థులు రోగాల బారిన పడకుండా మెరుగైన సౌకర్యాలు అందించాలని ఆయన కోరారు. కేవలం కాంట్రాక్టర్లు బిల్లుల కోసమే త్వరితగతిన పనులు పూర్తి చేశారని ఏ ఒక్క పని లో కూడా నాణ్యత లేదని స్కూల్ బిల్డింగు వసతిగృహము భోజనశాల నిర్మాణం చేసిన కాంట్రాక్టర్లపై వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శిలు సోమిరెడ్డి పల్లె నారాయణ చేజర్ల రవి పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## టీచర్స్ డే సందర్భంగా ఎంఈఓలకు కూడా అవార్డులు అందచేయాలి



- ఎంఈఓ 1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం విజ్ఞప్తి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** టీచర్స్ డే సందర్భంగా ఉపాధ్యాయులతో పాటు విధి నిర్వహణ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మండల విద్యాశాఖ అధికారులకు కూడా అవార్డులు అందజేయాలని ఎంఈఓ 1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కు లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేసినట్లు సామల తెలిపారు. విద్యా శాఖలో క్షేత్రస్థాయిలో విద్యారంగ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయటంలో మండల విద్యాశాఖ అధికారులు కీలక పాత్రను పోషిస్తున్నారని, విద్యా రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ఎంఈఓల సేవలను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఏటా ఉపాధ్యాయ దినోత్సవం రోజు ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు ఇచ్చి గౌరవించడం ఎంతో హర్షణీయమని, అదే మాదిరిగా ఎంఈఓల సేవలను కూడా గుర్తించి, విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందచేస్తే ప్రోత్సాహకరంగా ఉంటుందని విద్యామంత్రికి తమలేఖలో విజ్ఞప్తి చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం పేర్కొన్నారు.

## ఆరేళ్లుగా ఆగిపోయిన ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు మోక్షం కల్పించాలి : ఇ.యు

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఇ.యు) రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. ఆరేళ్లుగా వివిధ కారణాలతో పదోన్నతులు నిలిచిపోవడం వల్ల ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వీ. నరసయ్య తెలిపారు. వారి వివరాల ప్రకారం, ఆర్టీసీ అధికారులు పదోన్నతుల ఫైళ్ళను పదేపదే ప్రభుత్వానికి పంపుతున్నప్పటికీ, ప్రభుత్వం వాటిని వెనక్కి పంపుతూ వస్తోందని, దీంతో ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాని పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. గత నెల 31న కూడా ఆ ఫైలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వద్దకు వెళ్లినా, అక్కడే ఆగిపోయిందని, ఆర్టీసీ ఉద్యోగుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరారు. పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న ఈ ఆరేళ్లలో దాదాపు 2000 మంది ఉద్యోగులు రిటైర్ కావడం దురదృష్టకరమని తెలిపారు. వెంటనే అనుమతులు ఇస్తే అధికారులు నుంచి క్లాస్‌ఫ్లోర్ స్థాయి ఉద్యోగుల వరకు సుమారు 3000 మందికి పదోన్నతులు లభించే అవకాశం ఉందని, దీని ద్వారా ప్రభుత్వానికి కూడా మంచి పేరు వస్తుందని యూనియన్ నాయకులు అభిప్రాయపడ్డారు. ఆగస్టు 15న స్త్రీశక్తి పథకం ప్రారంభానికి వచ్చిన సందర్భంగా ఈ సమస్యపై ముఖ్యమంత్రికి లేఖను సమర్పించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ముఖ్యమంత్రి, రవాణా మంత్రి స్వయంగా చొరవ తీసుకొని ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని, దీంతో ఉద్యోగుల్లో నెలకొన్న అసంతృప్తిని తగ్గించాలని ఇ.యు రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది.

### అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి సాదియా అల్మాస్‌కు

## మంత్రి నారా లోకేష్ మరోసారి ఆర్థిక సాయం



**మంగళగిరి టౌన్ , (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారిణికి రూ. 2.50 లక్షలు అందజేశారు. నార్త్ అమెరికాలోని కోస్తారియాలో ఈ నెల 24వ తేదీ నుంచి సెప్టెంబర్ 7వ తేదీ వరకు జరుగుతున్న అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలకు భారతదేశం నుంచి మంగళగిరి నియోజకవర్గానికి చెందిన సాదియా అల్మాస్ పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ఛాంపియన్ షిప్‌లో పాల్గొనడానికి ఆర్థిక సాయం చేయాలని మంత్రి నారా లోకేష్‌ను కలిసి కోరారు. ఇందుకు మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ, రాష్ట్రానికి, దేశానికి పేరు తెచ్చేలా కృషి చేయాలని, ఛాంపియన్ షిప్‌లో పాల్గొనడానికి అవసరమైన ఆర్థిక సాయం అందిస్తామని ఆమెకు భరోసా ఇచ్చారు. మంగళవారం ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరుతో రూ. 2.50 లక్షలను స్థానిక నాయకుల ద్వారా పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి సాదియా అల్మాస్‌కు అందజేయించారు. అడిగిన వెంటనే రూ. 2.50 లక్షలు ఆర్థిక సాయం అందజేసిన మంత్రి నారా లోకేష్‌కు సాదియా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సాదియా అల్మాస్ మాట్లాడుతూ నన్ను ఎంతో ప్రోత్సహిస్తున్న మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. మంత్రి నారా లోకేష్ గతంలో కూడా రూ. 3 లక్షలు ఆర్థిక సహాయం చేసి ప్రోత్సహించినట్లు తెలిపారు. టీటీడీ పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ సాదియా చదువుతూనే పవర్ లిఫ్టింగ్‌లో ప్రపంచ స్థాయిలో రాణించడం గొప్ప విషయమన్నారు. కోస్తారియాలో జరిగే వరల్డ్ పవర్ లిఫ్టింగ్‌లో పోటీల్లో రాణించి దేశానికి, రాష్ట్రానికి, మంగళగిరికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. మంత్రి నారా లోకేష్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వివిధ రకాల టోర్నమెంట్స్ నిర్వహించడంతో పాటు కిట్స్ పంపిణీ చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, పట్టణ ఉపాధ్యక్షురాలు వాసా పద్మ, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, తోట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# శక్తి యాప్ మహిళలకు భద్రతా కవచంలా ఉపయోగపడుతుంది

- మహిళల హక్కులు, భద్రత, సాధికారతే మహిళా కమిషన్ లక్ష్యం
- సోషల్ మీడియా వాడేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి
- పది మందికి పైగా ఉద్యోగులు ఉంటే సంస్థల్లో ఐసీసీ తప్పనిసరి
- వన్ స్టాప్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- మహిళా ఉద్యోగులు గౌరవంగా, భద్రంగా పనిచేసే వాతావరణం పీవోఎస్ హెచ్ చట్టం కల్పిస్తుంది
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణకు అనేక చట్టాలను తీసుకువచ్చాయి
- డాక్టర్. రాయపాటి శైలజ, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్




**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ (. డాక్టర్. రాయపాటి శైలజ అన్నారు. విజయవాడ వన్ టౌన్ లోని కేబీఎన్ కళాశాలలో మంగళవారం "మహిళల సంక్షేమం, భద్రత, రక్షణ మరియు సాధికారతపై జిల్లా స్థాయి అవగాహన సమావేశం" జరిగింది. ఎన్టీయార్ జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ మరియు సాధికారత సంస్థ, UGC ఉమెన్స్ స్టడీ సెంటర్ - కేబీఎన్ కళాశాల సహకారంతో నిర్వహించిన అవగాహన సదస్సుకు రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాయపాటి శైలజ మాట్లాడుతూ మహిళలు ఎటువంటి ఆపదలో ఉన్నా శక్తి యాప్ లో సహాయం కోరవచ్చన్నారు. మహిళలు, బాలికలు శక్తి యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవాలని కోరారు. ఇటీవల సైబర్ నేరాలు అనే కొత్త ముప్పు పొంచి ఉందని, మహిళలు డిజిటల్ భద్రతా చైతన్యం పెంచుకోవాలన్నారు. అవసరమైన సమయంలో ప్రభుత్వ హెల్ప్ లైన్స్, చట్టపరమైన రక్షణను ఉపయోగించుకోవాలన్నారు. సోషల్ మీడియాలో మహిళలపై వేధింపులు జరుగుతున్నాయని, నకిలీ అకౌంట్లు సృష్టించి అపవాదులు వేయడం, వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు దుర్వినియోగం చేయడం వంటి పై అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు ప్రత్యేక రక్షణ కోసం 181 హెల్ప్ లైన్ ద్వారా తక్షణ సహాయం పొందాలని డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. మహిళల భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చట్టాలు, కార్యక్రమాలు నిర్వహిస్తుందని డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. ఇప్పటికీ అక్కడక్కడ కొన్ని సంఘటనలు జరుగుతున్నాయని, వాటి నివారణకు క్షేత్రస్థాయి నుండి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆడపిల్లలు, మహిళలపై అన్యాయాలు, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పది మందికిపైగా ఉద్యోగులు ఉన్న సంస్థల్లో ఐసీసీ(ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ) ఉండాలని డాక్టర్ రాయపాటి అన్నారు. పని ప్రదేశంలో మహిళా ఉద్యోగులు గౌరవంగా, భద్రంగా పనిచేసే వాతావరణం కల్పించడం ఆయా సంస్థల యాజమాన్యల బాధ్యత అని తెలిపారు. మహిళల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. మహిళలు, బాలికల కష్ట సమయంలో సురక్షిత ఆశ్రయం, సహాయం పొందడానికి ఆశ్రయ గృహాలు, శక్తి సదన్ లు, సఖి సెంటర్లు, చైల్డ్ హోమ్స్ ఉపయోగపడుతున్నాయన్నారు. సఖీ వన్ స్టాప్ సెంటర్ లో అన్ని సేవలు ఒకే చోట లభిస్తాయన్నారు. విద్యార్థులు తమ చదువు, లక్ష్యాలపై దృష్టి పెట్టాలని ప్రేరణనిచ్చారు. ప్రభుత్వం మహిళా సాధికారత కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని, తాజాగా ప్రారంభించిన "స్త్రీశక్తి పథకం" వాటిలో ముఖ్యమైనదన్నారు. అనంతరం వన్ స్టాప్ సెంటర్, మహిళ పథకాలపై అవగాహన పెంచేలా రూపొందించిన పోస్టర్ ను డాక్టర్ రాయపాటి శైలజ విడుదల చేశారు. కార్యక్రమంలో CWC సభ్యురాలు రాధాకుమారి, జిల్లా మహిళా & శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి షెక్ రుఖ్సానా సుల్తాన్ బేగమ్, మహిళా కమిషన్ కార్యదర్శి అనురాధ, కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, కార్యదర్శి & ప్రతినిధి టీ.శ్రీనివాస్, MEOలు, CDPOలు, జిల్లా ICC కమిటీ చైర్మన్&సభ్యులు, అధ్యాపకులు, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది, OSC SI & ASI, SHG గ్రూపుల మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# జీఓ76 అమలుకు చర్యలు తీసుకుంటాం

- బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని అర్చకుల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని టీడీపీ ఏపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ వెల్లడించారు. మంగళవారం టిడిపి కేంద్ర కార్యాలయంలో జరిగిన బ్రాహ్మణ సాధికార సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు బ్రాహ్మణుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆయన విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమం కోసం తీసుకువచ్చిన జీఓ 76ని రద్దు చేసి, 439 జీఓ జారీ చేసినా, దానిని కూడా అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించిందని అన్నారు. కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకపోవడం వల్ల బ్రాహ్మణులు మోసపోయారని ఆయన పేర్కొన్నారు. "త్వరలో జీఓ 76 అమలుకు చర్యలు తీసుకుంటాం" అని హామీ ఇచ్చారు.

దేశంలోనే తొలిసారి బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని, తర్వాత మరో 12 రాష్ట్రాల్లో ఇలాంటి కార్పొరేషన్లు ఏర్పడ్డాయంటే అది చంద్రబాబు నాయుడు ముందుచూపుకు నిదర్శనమని బుచ్చి రాంప్రసాద్ వివరించారు. రాష్ట్రంలో 27 వేల ఆలయాల్లో 90 వేల అర్చక కుటుంబాలు పౌరోహిత్యం నిర్వహిస్తున్నాయని, ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా కార్పొరేషన్ కృషి చేస్తుందని తెలిపారు. అర్చక వృత్తిని కుల వృత్తిగా గుర్తించే అంశాన్ని పరిశీలించమని సీఎం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. వేద విద్యను అభ్యసించిన బ్రాహ్మణ యువతకు నిరుద్యోగ భృతి అమలు చేయాలన్న లోకేష్ హామీని గుర్తుచేస్తూ, అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే దాదాపు 900 మందికి నెలకు రూ. 3 వేల చొప్పున ఏడాది పాటు భృతి అందజేశామని తెలిపారు. టీడీపీ మేనిఫెస్టోలో బ్రాహ్మణ సంక్షేమం కోసం 11 అంశాలు ప్రతిపాదించామని, ఆలయాల ఆగమ, వైదిక విషయాల్లో అధికారుల జోక్యం లేకుండా స్వయంప్రతిపత్తి కల్పించేందుకు ప్రభుత్వం జీఓ జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. ఆలయాల ట్రస్ట్ బోర్డుల్లో అదనంగా మరో ఇద్దరికి అవకాశం కల్పించామన్నారు. రాష్ట్రంలో రూ. 50 వేలకుపైగా ఆదాయం ఉన్న ఆలయాల అర్చకులకు కనీస వేతనం రూ. 15 వేలకు పెంచామని, అర్చకుల కోసం ఆలయాల సమీపంలో వసతి గృహాలు కల్పించేందుకు కూడా చర్యలు చేపడతామని గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇతర రాష్ట్రాల్లో బ్రాహ్మణ సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలపై సమాలోచన చేసి, మన రాష్ట్రంలోనూ వాటిని అమలు చేస్తామని బుచ్చి రాంప్రసాద్ స్పష్టం చేశారు. బ్రాహ్మణ సాధికార సమితి ఆధ్వర్యంలో అర్చకుల సమస్యల పరిష్కారానికి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. "బ్రాహ్మణ సమాజానికి ఏం కావాలన్న చెప్పండి 100% అమలు చేసేందుకు నేను కృషి చేస్తాను" అని బుచ్చి రాంప్రసాద్ హామీ ఇచ్చారు.

ఈ సమావేశానికి బ్రాహ్మణ సాధికార సమితి ప్రతినిధి ఈమని సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీ రమణ, జేఏసీ అధ్యక్షులు జంధ్యాల వెంకట రామలింగేశ్వర శర్మ, జేఏసీ జనరల్ సెక్రటరీ ఎంవీ శేషాచారి, రాష్ట్రవ్యాప్తంగా అర్చకులు, సాధికార సమితి సభ్యులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా పేదలకు సహాయం అందించాలి - ఎమ్మెల్యే గళ్ళా మాధవి



- బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బుచ్చి రామ్ ప్రసాద్‌ను సత్కరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన బుచ్చి రామ్ ప్రసాద్ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన సందర్భంగా, ఆయన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవిని మంగళవారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి, బుచ్చి రామ్ ప్రసాద్ ను తిరుమల తిరుపతి దేవస్థాన దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ ముఖ్యమైన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, పేద మరియు ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణ కుటుంబాలకు కార్పొరేషన్ ద్వారా చేయూతనందించాలని ఆమె సూచించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, ఆర్థిక సహాయం వంటి రంగాలలో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి, సమాజానికి ఉపయోగపడే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు.

## శంకర్ విలాస్ ఆర్ఓబి పనులకు సహకరించాలి : మేయర్, కమిషనర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరులో శంకర్ విలాస్ ఆర్ఓబి (వంతెన) నిర్మాణ పనులు ప్రారంభమైనందున వాటిని వేగవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. పనులలో భాగంగా స్థలాలు లేదా భవనాలు కోల్పోతున్న వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం టిడిఆర్ బాండ్లు, నష్టపరిహారం అందజేస్తామని భరోసా ఇచ్చారు.

మంగళవారం కమిషనర్ చాంబర్లో వంతెన నిర్మాణానికి సంబంధించి కోర్టు కేసులు దాఖలు చేసిన భవన యజమానులతో మేయర్, కమిషనర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంకర్ విలాస్ వంతెనలో పిల్లర్ల నిర్మాణం ఇప్పటికే జరుగుతోందని, ప్రజల సౌకర్యం దృష్ట్యా ఈ వంతెన పనులు వేగంగా జరిగేలా కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు.

కోర్టు కేసులు దాఖలు చేసినవారు కూడా నగర అభివృద్ధికి తోడ్పడాలని, వారి సమస్యలను పరిష్కరించడానికి జిఎంసి, జిల్లా సర్వేయర్ల బృందం ఆయా యజమానులు కోరిన విధంగా వారి సర్వేయర్ల సమక్షంలో మాస్టర్ ప్లాన్ మేరకు రీ సర్వే నిర్వహిస్తుందని తెలిపారు. రీ సర్వేలో లోపాలు తలెత్తితే తగిన మార్పులు చేయడానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నగరానికి కీలకమైన ఈ వంతెన పనులను ఏడాదిలోపే పూర్తిచేయాలన్నది లక్ష్యమని మేయర్, కమిషనర్ వెల్లడించారు.

సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఏసీపీ రెహ్మాన్, బ్రాడిపేట, అరండల్‌పేట భవన యజమానులు పాల్గొన్నారు.

## 200 యూనిట్ల ఉచిత విద్యుత్తుపై నాయీ బ్రాహ్మణులు హర్షం

- నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాలు నుంచి శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయం వరకు కృతజ్ఞత ర్యాలీ



**మంగళగిరి టౌన్ , (జర్నలిస్ట్ ఫైల్):** నాయి బ్రాహ్మణుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషికి మంగళగిరి నియోజకవర్గ నాయి బ్రాహ్మణ సేవా సంఘం కృతజ్ఞతలు తెలిపింది. మంగళవారం మంగళగిరి పట్టణంలోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలు నుంచి శ్రీలక్ష్మినరసింహస్వామి వారి దేవస్థానం వరకు నాయీ బ్రాహ్మణులు కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను నెరవేర్చినందుకు వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వృత్తి ఆధారిత వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, ముఖ్యంగా కల్లుగీత కార్మికులు, నాయీ బ్రాహ్మణులు, చేనేత కార్మికుల కోసం కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. నాయి బ్రాహ్మణులు నిర్వహిస్తున్న సెలూన్ షాపులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఎండోమెంట్ పరిధిలోని దేవాలయాల్లో పనిచేస్తున్న వారికి నెలవారీ వేతనాన్ని 25,000 రూపాయలకు పెంచడం వంటి చర్యలతో నాయి బ్రాహ్మణుల జీవితాలలో వెలుగు నింపారని తెలిపారు. బీసీలకు కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. గత ప్రభుత్వం చేసిన పాపాలు, నిర్లక్ష్యం వల్ల ఇబ్బందులు పడుతున్నా సూపర్ సిక్స్ తో పాటు అన్ని పథకాలను 100 శాతం అమలు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివశేషగిరి రావు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల సంక్షేమం కోసం ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. నాయీ బ్రాహ్మణులకు ఇచ్చే గౌరవ వేతనం రూ. 20 వేల నుంచి 25 వేలకు పెంచడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి దేవాదాయ శాఖ జీవో నెంబర్ 130 ఇప్పటికే ఉత్తర్వులు విడుదల చేసినట్లు చెప్పారు. 6 A కేటగిరి దేవాలయాల్లో కేశఖండన చేస్తున్న 44 దేవాలయాలకు ఈ జీవో అమలు కానుందన్నారు. అన్ని దేవాలయల్లో నియమించే కమిటీల్లో నాయీ బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం ఇచ్చేలా ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే డోలు -సన్నాయి వాయించే దేవాలయాల్లో ఉన్న ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని సర్కులర్ కూడా జారీ చేసినట్లు తెలిపారు.

మొదటి నుంచి మంత్రి నారా లోకేష్ నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. మంగళగిరి నియోజకవర్గంలో నాయీ బ్రాహ్మణులకు సొంత నిధులతో 200 సెలూన్ కుర్చీలు ఇచ్చిన ఘనత మంత్రి నారా లోకేష్‌దేనని అన్నారు.

ఈ కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, పట్టణ ఉపాధ్యక్షురాలు వాసా పద్మ, వల్లూరి శివయ్య, ఆకునూరి ఉమామహేశ్వరరావు, తెంపల్లి దుర్గారావు, కొక్కిరిపాటి పూర్ణచంద్రరావు, ఊట్ల దుర్గమల్లేశ్వరి, వాకా మాధవ రావు, పందేటి తిరుపతయ్య, ఆకునూరి కరుణా తదితరులు పాల్గొన్నారు.


# శ్రీశైలం ఆలయంలో హుండీ దొంగతనం కలకలం

- సీసీ టీవీ ఫుటేజ్ దాచివేతపై అనుమానాలు
- సీఎస్ఓ ఫిర్యాదులో సమయ తేడాలు
- ఆలయ భద్రత ప్రశ్నార్థకం

**శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్):** శ్రీశైలం మహా పుణ్యక్షేత్రంలో హుండీ దొంగతనంపై సంచలన ఆరోపణలు వెలువడుతున్నాయి. ఆలయ గర్భాలయంలో లైట్లు ఆఫ్ చేసి, భక్తులు సమర్పించిన కానుకలను క్లాత్ హుండీ నుండి దొంగిలించినట్లు ఒప్పంద పరిచారక హెచ్. విద్యాధర్‌పై దేవస్థానం, పోలీసులు గుర్తించారు. గడిచిన 80 రోజుల్లో 3 లక్షలకుపైగా సొమ్ము దోచుకున్నాడని ప్రాథమిక విచారణలో తేలింది.

**సీసీటీవీ ఫుటేజీపై వివాదం :** ఆలయంలో 600 సీసీటీవీ కెమెరాలు, 250 మందికి పైగా భద్రతా సిబ్బంది ఉండగా, దొంగతనం జరిగి కూడా నిందితుడు ఎలా తప్పించుకున్నాడన్న ప్రశ్నలు లేవుతున్నాయి. దొంగతనం సీసీటీవీలో రికార్డు అయ్యిందన్న సమాచారం ఉన్నప్పటికీ, ఆ విజువల్స్‌ను మీడియాకు అందించకుండా రూ. 10 లక్షల లంచం తీసుకున్నారన్న ఆరోపణలు ముదురుతున్నాయి. ఇదే ఏడాది ఒక మైనర్ బాలుడు రూ. 10 వేల్ని హుండీ నుండి దొంగిలించగా, అతని ఫోటోలను వెంటనే విడుదల చేసిన దేవస్థానం, పెద్ద మొత్తాల దొంగతనంపై మాత్రం మౌనం పాటించడం భక్తుల్లో అనుమానాలు రేకెత్తిస్తోంది. వేళ కాని వేళల్లో ఆలయంలోకి చేరిన విద్యాధర్, గర్భాలయ ద్వారాలు తెరిచి, శుద్ధి చేస్తున్నట్టు నటించి లైట్లు ఆఫ్ చేసి విగ్రహాలను బట్టతో తుడుస్తున్నట్టు నాటకమాడి, ఆ బట్టను హుండీలో వేసి, దానిని తీసే క్రమంలో పెద్ద నోట్లు, బంగారు ఆభరణాలను దోచుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆ సొమ్మును శ్రీలింగ ప్రదేశంలో దాచిపెట్టి తర్వాత ఇతర చోట్లకు తరలించాడని సమాచారం.

**సీఎస్ఓ నివేదికపై అనుమానాలు:** ఈ ఘటనపై సీఎస్ఓ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో సమయ తేడాలు ఉన్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. విధులలో భాగంగా తేది. 16-07-2025న. ఉదయం గం. 02:20 సీసీ కమాండ్ కంట్రోల్ రూమ్ లో సీసీటీవీ పరిశీలించగా. ఉదయం గం. 02:20 ని' లకు దొంగతనం చేస్తున్నట్టు గమనించి, సి.ఎస్.ఓ సీసీటీవీ ఉదయం గం. 02:15 వరకు బ్యాకప్ పరిశీలించగా, ఉదయం గం. 02:15 ని'ల నుండి గం. 02:27 ని' ల వరకు 5 సార్లు దొంగతనం చేస్తున్నట్టు దృశ్యాలను చూసి, ఉదయం. గం. 2:30 ని' లకు ఆలయంలోకి వెళ్లగా అప్పటికే హెచ్. విద్యాధర్ పరిచారక వెళ్లిపోయినాడు అని తెలపడం జరిగింది. ఇందులో గమనించదగ్గ విషయం ఏమిటంటే ఉదయం. గం. 02:20 ని' లకు తిలకించి, బ్యాకప్ గం. 02:15 ని' ల వరకు తిలకించి, మరలా ముందుకు ఉదయం గం 02:27 ని " ల వరకు రావడం అంటే 12 ని' లు అదనంగా సమయం పట్టింది, అప్పటికి ఉదయం గం. 02:39 ని' లు. అప్పటి వరకు సి.ఎస్.ఓ సీసీటీవీ కంట్రోల్ రూమ్ లోనే ఉన్నాడు, అక్కడ నుండి హెచ్. విద్యాధర్ ను పట్టుకొనుటకు ఉదయం గం. 02:30 లకు ఆలయం లోపలికి వెళ్ళామని తెలిపి ఉన్నారు. అతను గం. 02: 20 ని' ల నుంచి బ్యాకప్ తిలకించి, గం. 02: 27 ని' ల వరకు సీసీటీవీ చూచినాను అన్నాడు, అనగా అప్పటికి ఉదయం గం. 02:39 ని' లు అయి ఉంటుంది, అప్పటికి సి.ఎస్.ఓ సీసీటీవీ కంట్రోల్ రూమ్ లో ఉన్నాడు. మరి ఆలయం లోపలికి ఉదయం. గం. 02:30 ని' లకు ఎలావెళ్లగలిగి ఉంటాడు, ఇలా తప్పుడు నివేదిక



తయారు చేసినందుకు, సి.ఎస్.ఓ చట్టరీత్యా నేరస్తుడే, ఈ రకమైన ఫిర్యాదు ఇచ్చినందుకు ప్రత్యక్షంగా సహాయ సహకారాలు అందించినందుకు దేవస్థానం ఈవోని కూడా నేరస్తుని గానే పరిగణించాలని చట్టం చెబుతున్నదని సీనియర్ న్యాయవాదులు, నిపుణులు ఆరోపిస్తున్నారు. ఆలయ భద్రతలో ఇంత పెద్ద లోపం ఎలా చోటు చేసుకుందో, అధికారుల పాత్ర ఏంటో అన్నదాని పై స్పష్టత రావాల్సి ఉంది. శ్రీశైలం ఆలయంలో ఇంతటి పెద్ద భద్రతా వలయంలోనూ హుండీ దొంగతనాలు జరగడం, సీసీటీవీ ఫుటేజ్ దాచిపెట్టడం పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై సత్యం బయటపడే వరకు భక్తుల ఆగ్రహం చల్లారనట్లు ఉంది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467